ఆంధ్రజ్యోతి


ANDHRAJYOTHY

5

తిరుపతి

జిల్లా వార్తలు

సోమవారం 24 ఫిబ్రవరి 2025





చేపలు అధరహో

'బర్డ్ ఫ్లూ' ప్రభావంతో చికెన్ కొనుగోళ్లు పడిపోయాయి. చేపలకు గిరాకీ పెరిగింది. దీంతో చేపల రకాలను బట్టి కిలోపై రూ.30 నుంచి రూ.వంద వరకు ధరలు పెరిగాయి. అయినా కొనుగోళ్లు తగ్గలేదు. ఆదివారం తిరుపతిలోని చేపల దుకాణాలు రద్దీగా కనిపించాయి. చికెన్ ధర తగ్గినా.. కొనేవాళ్లు లేక దుకాణాలు వెలవెలపోయాయి.

- తిరుపతి(లీలామహల్), ఆంధ్రజ్యోతి

కిక్కిరిసిన అలిపిరి

తిరుమలకు ముఖద్వారమైన అలిపిరి తనిఖీ కేంద్రం ఆదివారం వాహనాలతో కిక్కిరిసింది. తిరుమలలో భక్తుల క్యూలైన్ బయటకు వ్యాపించకపోయినా, అలిపిరిలో మాత్రం వాహనాలు క్యూకట్టాయి. ఇటీవల సొంత వాహనాల్లో తిరుమలకు వచ్చేవారి సంఖ్య పెరిగింది. దీంతో రద్దీ మోస్తరుగానే ఉన్నప్పటికీ అలిపిరి తనిఖీ కేంద్రంలో మాత్రం వాహనాలు బారులు తీరుతున్నాయి.

- తిరుమల, ఆంధ్రజ్యోతి



రేణిగుంటకు సీఎం చంద్రబాబు

- నరసింహ యాదవ్ తనయుడి వివాహానికి హాజరు



వధూవరులను ఆశీర్వదించాక, నరసింహయాదవ్ కుటుంబ సభ్యులతో సీఎం



చిన్నారితో చంద్రబాబు

తిరుపతి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు ఆదివారం రేణిగుంటకు వచ్చారు. తూకివాకం సమీపంలోని ఆర్వీఆర్ ఫంక్షన్ హాలులో ఆదివారం జరిగిన ఏపీ యాదవ కార్పొరేషన్ చైర్మన్, తిరుపతి పార్లమెంటరీ టీడీపీ కమిటీ అధ్యక్షుడు గొల్ల నరసింహ యాదవ్ కుమారుడి వివాహానికి హాజరయ్యారు. మధ్యాహ్నం 12 గంటల సమయంలో వచ్చిన ఆయన.. వధూవరులు సుదర్శన్ యాదవ్, పూజలను ఆశీర్వదించారు. వధూవరుల తల్లిదండ్రులు, బంధుమిత్రులతో కలసి గ్రూపు ఫొటోలు దిగారు. సుమారు అరగంట పాటు ఆయన పెళ్లి మండపంలో గడిపారు. అనంతరం విమానాశ్రయం చేరుకుని హెలికాప్టర్‌లో నెల్లూరు జిల్లా పర్యటనకు వెళ్లారు. కాగా, ఉదయం ఉండవల్లి నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి 11.40 గంటలకు రేణిగుంట విమానాశ్రయం చేరుకున్న సీఎంకు పలమనేరు, చంద్రగిరి, నగరి, జీడీనెల్లూరు, చిత్తూరు, పూతలపట్టు ఎమ్మెల్యేలు అమరనాథరెడ్డి, పులివర్తి నాని, గాలి భానుప్రకాష్, డాక్టర్ థామస్, గురజాల జగన్మోహన్, మురళీమోహన్, అనంతపురం డీఐజీ షిమోషి బాజ్‌పాయ్, కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ హర్షవర్ధన్ రాజు, జేసీ శుభం బన్సాల్, మున్సిపల్ కమిషనర్ మౌర్య, టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి తదితరులు ఘనస్వాగతం పలికారు.

అధినేత రాకతో..

టీడీపీ ఆవిర్భావం నుంచీ కొనసాగుతున్న నరసింహ యాదవ్.. తన కుమారుడి వివాహానికి అధినేత చంద్రబాబు హాజరు కావడంతో ఉబ్బితబ్బిబ్బయ్యారు. తొలి నుంచీ ఆయనకు సిన్సియర్ నాయకుడిగా గుర్తింపు ఉంది. గత టీడీపీ ప్రభుత్వంలో తుడా చైర్మన్‌గా నియమించారు. ఎన్నికలకు ముందు నుంచీ జిల్లా టీడీపీ అధ్యక్షుడిగా పనిచేస్తున్న ఆయన ప్రస్తుతం ఎమ్మెల్సీ లేదా టీటీడీ చైర్మన్ పదవిని ఆశించారు. ఏపీ యాదవ కార్పొరేషన్ చైర్మన్ పదవి ఇవ్వగా.. ఆయన సంతోషంగా లేరు. తాను మరో రెండేళ్లయినా వేచి చూస్తానని, తనకు సముచిత పదవి ఇవ్వాలని అధిష్ఠానాన్ని కోరారు. ఆ మేరకు ఇప్పటికీ యాదవ కార్పొరేషన్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టలేదు. తాజాగా ఆదివారం అధినేత చంద్రబాబు కేవలం నరసింహ యాదవ్ తనయుడి వివాహానికే ప్రత్యేకంగా రావడం.. అరగంట పాటు వారితో గడపారు. ఇలా.. అధినేత తనకిచ్చిన ప్రాధాన్యతకు నరసింహ యాదవ్, ఆయన కుటుంబీకులకు సంతోషం కలిగించింది.

శంకర్‌నాయక్ అరెస్టుతో

తిరుపతిలో కలకలం



మాజీ సీఎం జగన్.. వైసీపీ నేత సజ్జల రామకృష్ణారెడ్డితో శంకర్ నాయక్

తిరుపతి, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): విజయవాడ మాచవరంలోని ఓ స్పా సెంటర్‌లో వైసీపీ నేత వడిత్యా శంకర్‌నాయక్ పట్టుబడిన ఘటన తిరుపతిలో కలకలం రేపింది. ఈ శంకర్‌నాయక్ ఎవరు? అతడి నేపథ్యం ఏమిటన్న చర్చ రాష్ట్రవ్యాప్తంగా మొదలైంది. తిరుపతి కేంద్రంగా విద్యార్థి సంఘ ఉద్యమాల్లో అడుగుపెట్టి.. విద్యార్థి నేతగా, ఆపై ప్రజా సంఘ నాయకుడిగా, చివరికి రాజకీయ నేతగా మారిన శంకర్‌నాయక్.. తాజా నిర్వాకంతో ఆయన్ను తెలిసిన వారు విస్తుపోతున్నారు. అనంతపురం జిల్లా ధర్మవరం సమీపంలోని ఓ గిరిజన తాండాకు చెందిన వడిత్యా శంకర్ నాయక్ డిగ్రీ చదువు కోసం తిరుపతికి వచ్చారు. ఎస్వీ ఆర్ట్స్ కాలేజీలో డిగ్రీ, ఎస్వీయూలో పీజీ చేశారు. తొలుత ఓ వామపక్ష విద్యార్థి సంఘంలో చేరి చురుగ్గా పనిచేశారు. అతడి వ్యవహార శైలి బాగాలేదని ఆ పార్టీ ముఖ్యనేతలు అభ్యంతరం వ్యక్తం చేయడంతో బయటికి వచ్చేశారని సమాచారం. తర్వాత గిరిజన విద్యార్థి సమాఖ్య ఏర్పాటు చేసి గిరిజన, ఆదివాసీల హక్కుల పరిరక్షణ పేరిట కార్యక్రమాలు కొనసాగించారు. ఆ సమయంలో టీటీడీ ఈవో ఎల్వీ సుబ్రహ్మణ్యం గిరిజనుల పట్ల వివక్ష చూపుతున్నారంటూ ఏకంగా అట్రాసిటీ కేసు పెట్టారు. ఈ ఘటనతో గిరిజన వర్గాల్లో గుర్తింపు తెచ్చుకున్నారు. కొంతకాలం తర్వాత ఆ విద్యార్థి సమాఖ్యను గిరిజన ప్రజా సమాఖ్యగా మార్చి.. విజయవాడ, విశాఖపట్నం కేంద్రాలుగా రాజకీయ కార్యకలాపాలకు దిగారు. ఆ క్రమంలో వైసీపీకి అనుకూలంగా వ్యవహరిస్తూ.. గతంలో సీఎంగా ఉన్న చంద్రబాబును లక్ష్యంగా చేసుకొని విమర్శలు, ఆరోపణలు చేసేవారు. అలా వైసీపీ నాయకుల దృష్టిలో పడ్డారు. 2019 ఎన్నికల్లో అనంతపురం జిల్లాలో ఒకరిద్దరు ఎమ్మెల్యే అభ్యర్థుల గెలుపు కోసం గట్టిగా పని చేసి వారి ప్రాపకం సంపాదించారు. ఆ ఎన్నికల్లో వైసీపీ అధికారంలోకి రాగా.. అప్పటి సీఎం జగన్ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డికి సన్నిహితుడయ్యారు. ఆ సాన్నిహిత్యంతో రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడిగా నియమితులయ్యారు. గిరిజన విద్యార్థి సమాఖ్య, గిరిజన ప్రజా సమాఖ్యల పేరిట సంక్షేమ హాస్టళ్లు, గురుకులాల నిర్వహణలో తరచూ జోక్యం చేసుకునే వారని, అధికారులను, సిబ్బందిని వేధించేవారన్న ఆరోపణలు ఉన్నాయి. ఎస్టీ కమిషన్ సభ్యుడిగా క్యాబినెట్ హోదా కలిగిన పదవిలో మరింత దూకుడుగా వ్యవహరించారన్న విమర్శలు లేకపోలేదు. తాజాగా విజయవాడ మాచవరం ప్రాంతంలో ఓ స్పా సెంటర్లో వ్యభిచారం నడుస్తోందని వచ్చిన ఫిర్యాదులతో పోలీసులు దాడి చేయగా అక్కడ శంకర్‌నాయక్ పట్టుబడ్డారు. ఓ గదిలోని మంచం కింద దాక్కుని ఉన్న ఫొటోలు, వీడియోలు బయటికి రావడంతో తిరుపతిలో విద్యార్థి ప్రజా సంఘాలు విస్తుపోతున్నాయి. ఎస్టీ కమిషన్ మెంబరుగా ఇటీవలే ఆయన పదవీకాలం ముగిసింది. కాగా, తిరుపతికి వచ్చిన ప్రారంభంలో పేదరిక నేపథ్యంలో ఉన్న ఆయన.. ఇప్పుడు ఆర్థికంగా మంచి స్థాయికి చేరారని అతడి సన్నిహిత వర్గాలు చెబుతున్నాయి.



భాస్కర్ (ఫైల్‌ఫొటో)

లారీ ఢీకొని ఏఆర్ కానిస్టేబుల్ దుర్మరణం

నాయుడుపేట టౌన్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట మండలం పుదూరు సమీపంలో మోటారుసైకిల్‌ను లారీ ఢీకొనడంతో ఏఆర్ కానిస్టేబుల్ భాస్కర్ (39) దుర్మరణం చెందారు. పోలీసుల కథనం మేరకు... నాయుడుపేట పోలీసు స్టేషన్‌లో ఏఆర్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న భాస్కర్.. చిట్టమూరు మండలం ఈశ్వరవాకలో నివాసం ఉంటున్నారు. ఆదివారం సాయంత్రం విధులకు హాజరయ్యేందుకు మోటారు సైకిల్‌పై వెళ్తుండగా ఎదురుగా వస్తున్న లారీ ఢీకొంది. ఈ ఘటనలో అక్కడికక్కడే ఆయన మృతి చెందారు. నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు, అర్బన్ సీఐ బాబి ఘటనాస్థలాన్ని పరిశీలించారు. భాస్కర్ మృతదేహాన్ని నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భూత వాహనంపై

జగద్రక్షకుడు

ఉదయం.. పురవీధుల ఉత్సవానికి బయలుదేరుతున్న స్వామి అమ్మవార్లు



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి జగద్రక్షకుడైన పరమశివుడు భూతవాహనంపై.. జ్ఞానప్రసూనాంబ అమ్మవారు చిలుక వాహనంపై ఊరేగారు. మూషికవాహనంపై వినాయకస్వామి, చప్పరాలపై వళ్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి, చండికేశ్వరుడు, భక్తకన్నప్ప అనుసరించారు. రాజగోపురం గుండా తేరువీధిలోకి ప్రవేశించి.. ఆ తర్వాత నెహ్రూవీధి, నగరి వీధి, బజారువీధిగుండా స్వామి అమ్మవార్ల ఊరేగింపు సాగింది. ఉదయం.. సూర్యప్రభ వాహనంపై పరమ శివుడు, చప్పరంపై అమ్మవారు ఊరేగారు. వీరిని మూషిక వాహనంపై వినాయకస్వామి, చప్పరాలపై వళ్లీ, దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి, చండికేశ్వరుడు, భక్తకన్నప్ప అనుసరించారు. పురవీధుల్లో ఊరేగుతున్న పార్వతి, పరమేశ్వరులను భక్తులు దర్శించుకుని కర్పూర హారతులు సమర్పించారు. కోలాటాలు కనువిందుచేశాయి. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో బాపిరెడ్డి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



భూత వాహనంపై శివయ్య, చిలుకపై అమ్మవారి ఊరేగింపు

బ్రహ్మోత్సవాల్లో నేడు

ఉదయం 9గంటలకు : హంస - యాళి వాహనసేవ

రాత్రి 8 గంటలకు : రావణుడు - నెమలి వాహనసేవ



శ్రీపద్మావతి మహిళా డిగ్రీ, పీజీ కళాశాల కేంద్రానికి చేరుకుంటున్న అభ్యర్థులు

ప్రశాంతంగా

గ్రూప్-2 మెయిన్స్

ఉదయం 5,055, మధ్యాహ్నం 5,046 మంది హాజరు







చెప్పులు తీసి తనిఖీ - తనిఖీల్లో భాగంగా జడ రబ్బరు బ్యాండ్లను తీస్తూ.. - టైం అయిపోవడంతో అభ్యర్థి పరుగు

తిరుపతి(కలెక్టరేట్), ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని 13 కేంద్రాల్లో ఆదివారం ఏపీపీఎస్సీ గ్రూప్-2 మెయిన్స్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ఉదయం 10 నుంచి 12.30 గంటలవరకు.. మధ్యాహ్నం 3 నుంచి 5.30 గంటల వరకు రెండు విడతల్లో పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షలకు 5,801మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉంది. ఉదయం సెషన్‌లో 5,055 మంది పరీక్ష రాయగా, 746 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం సెషన్‌లో 5,046 మంది రాగా, 755 గైర్హాజరైనట్లు అధికారులు తెలిపారు. ప్రతి ఒక్కరిని పోలీసులు క్షుణ్ణంగా తనిఖీచేసి పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించారు. కలెక్టర్ వెంకటేశ్వర్, డీఆర్వో నరసింహులు, ఎస్పీ హర్షవర్ధన్‌రాజు పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు.

పరీక్ష రాసిన నవవధువు



నవవధువు జడను పరిశీలిస్తున్న సిబ్బంది

పసుపు వస్త్రాలు. తలపై జీలకర్ర, బెల్లం. కాళ్లకు పారాణితో నవవధువు మమత ఆదివారం గ్రూప్-2 మెయిన్స్ పరీక్ష రాశారు. తిరుపతికి చెందిన ఈమెకు ఉదయం చిత్తూరులో వివాహమైంది. అటు నుంచి నేరుగా తిరుపతిలోని శ్రీ పద్మావతి మహిళా డిగ్రీ, పీజీ కళాశాల పరీక్షా కేంద్రానికి చేరుకున్నారు. ఇలా కొత్త పెళ్లికూతురు పరీక్షా కేంద్రానికి రావడం ప్రత్యేకంగా నిలిచింది. ఇక, తలపై జీలకర్ర, బెల్లం తొలగించాలని సిబ్బంది చెప్పగా, ఆమె నిరాకరించారు. దీనిపై ప్రిన్సిపల్ నారాయణమ్మ ఉన్నతాధికారులతో మాట్లాడగా.. వారి సూచన మేరకు తనిఖీ చేసి ఆమెను పరీక్షకు అనుమతించారు.

- తిరుపతి(విద్య), ఆంధ్రజ్యోతి



ఉన్నతాధికారులతో ఫోనులో మాట్లాడుతూ..

'తొక్కిసలాట'పై నేడు విజయవాడ నుంచి వర్చువల్ విచారణ

తిరుపతి(కలెక్టరేట్), ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): వైకుంఠ ద్వార దర్శన టోకెన్ల జారీ సందర్భంగా జనవరి 8న తిరుపతిలో జరిగిన తొక్కిసలాటకు సంబంధించి సోమవారం విజయవాడ నుంచి వర్చువల్ విధానంలో జస్టిస్ సత్యనారాయణమూర్తి బాధితులను విచారించనున్నారు. ఈ ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం ఏకసభ్య న్యాయ విచారణ కమిషన్‌ను నియమించిన విషయం తెలిసిందే. తిరుపతి కలెక్టరేట్ వేదికగా కమిషన్ చైర్మన్ జస్టిస్ సత్యనారాణమూర్తి శనివారం రెండో దశ విచారణ చేపట్టారు. 11 మందిని విచారించారు. ఇదే ఘటనలో విశాఖకు చెందిన కొందరు మృతిచెందగా, మరి కొందరు తీవ్రంగా గాయపడ్డారు. విచారణకు హాజరు కావాలని ఈ ప్రాంతానికి చెందిన 19 మంది బాధితులకు న్యాయవిచారణ కమిషన్ నోటీసులు జారీ చేసింది. అయితే తామింకా కోలుకోలేదని గాయాలు ఇబ్బంది పెడుతున్నాయని, అంత దూరం రాలేమని వర్చువల్(జూమ్) మీటింగ్‌లో పాల్గొని ఘటనపై వివరిస్తామని వారు కమిషన్‌కు లిఖితపూర్వకంగా వివరణ పంపించారు. దీంతో జస్టిస్ సత్యనారాయణమూర్తి ఆదివారం ఉదయం విజయవాడకు బయలుదేరి వెళ్లిపోయారు. సోమవారం ఉదయం వైజాగ్ గోపాలపట్టణం తహసీల్దారు కార్యాలయం నుంచి వర్చువల్ విధానంలో న్యాయవిచారణ కమిషన్ ఎదుట బాధితులు హాజరు కానున్నారు. విజయవాడ నుంచి వర్చువల్ కమిషన్ చైర్మన్ జస్టిస్ సత్యనారాయణమూర్తి వారిని విచారించనున్నారు. కాగా, ఈ తొక్కిసలాట ఘటనలో గాయపడిన వారిలో కొందరు కేరళ, తమిళనాడుల్ల రాష్ట్రాల్లో ఉన్నారు. వీరూ వర్చువల్ విధానంలో విచారణకు హాజరుకానున్నట్లు తెలిసింది. దీని తర్వాత మూడో దశ విచారణ కీలకం కానుంది.


వైభవంగా స్వర్ణ రథోత్సవం

శ్రీనివాసమంగాపురంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం సాయంత్రం స్వర్ణ రథోత్సవాన్ని నిర్వహించారు. తొలుత స్వామి అమ్మవార్ల ఉత్సవర్లను వాహన మండపానికి తీసుకొచ్చి విశేషంగా అలంకరించారు. అనంతరం స్వర్ణరథంపై అధిష్ఠింపచేసి సంకల్ప పూజలు నిర్వహించారు. స్వర్ణ రథానికి ఏర్పాటు చేసిన మోకులను గోవింద నామస్మరణ చేస్తూ టీటీడీ అధికారులు, భక్తులు నెమ్మదిగా లాగారు. స్వామి వారు ఆలయ తిరుమాడ వీధులో భక్తులకు దర్శనమిచ్చారు. కాగా, స్వామివారు ఉదయం హనుమంతు వాహనం, రాత్రి గజ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు.

- చంద్రగిరి, ఆంధ్రజ్యోతి







జలధారల మధ్య ఏర్పాటు చేసిన శివలింగం

గంగా పార్వతి సమేత జీవలింగేశ్వర ఆలయం



గంగా పార్వతి సమేత జీవలింగేశ్వర స్వామి ఉత్సవ మూర్తులు

ప్రకృతి అందాల జీవలింగేశ్వరుడు

నగర పరిధిలోని జీవకోనలో చుట్టూ కొండలు, ఆహ్లాకరమైన వాతావరణం, నిత్యం జాలువారే జలపాతాల మధ్య గంగా పార్వతీ సమేత జీవలింగేశ్వరస్వామి కొలువై ఉన్నారు. వివాహం కాని, సంతానం లేని వారు స్వామి వారిని దర్శించి, ప్రతి శుక్రవారమూ రాహుకాల సమయంలో నిమ్మకాయ దీపం వెలిగించినట్లయితే కోరికలు తీరుతాయని భక్తులు నమ్ముతారు.

- తిరుపతి(జీవకోన), ఆంధ్రజ్యోతి

● గుడి ప్రాశస్త్యం


కపిలతీర్థానికి తూర్పు భాగాన కిలోమీటరు దూరంలో ఉన్న జీవలింగేశ్వరస్వామి ఆలయం ప్రాశస్త్యం ఇలా ఉంది. పూర్వం లోయగా ఉన్న ఈ ప్రాంతంలో బెంబేడు చెట్ల మధ్య జలధార ప్రవహించే ప్రదేశంలో శివలింగాన్ని భక్తులు గుర్తించి పూజలు చేసేవారు. ఇక్కడ ఋషులు తపస్సు చేసే వారని ప్రతీతి. నిరంతరం సాగే నీటి ప్రవాహం జీవంతో సమానం కనుక ఈ కోనకు జీవకోన అని పేరు వచ్చింది. గతంలో భక్తులు ఇక్కడ నీటిని తాగి సేదతీరే వారు. ఏడాది పొడవునా జలధార ఉన్న ఈ ఆలయానికి మహాశివరాత్రి, కార్తీకమాసం, పౌర్ణమి, నూతన సంవత్సరాది, ఉగాది లాంటి పర్వదినాల్లో భక్తులు అధిక సంఖ్యలో వస్తుంటారు. కొండకోనల్లో చెట్ల వేర్ల ద్వారా ప్రవహించే నీటితో అభిషేక పూజలు జరిపి, తీర్థంగా భక్తులకు అందిస్తుంటారు. ప్రతి పౌర్ణమికీ సాయంకాల సమయంలో అమ్మవారికి ప్రత్యేక పంచామృత అభిషేకం జరుగుతుంది.



ఆలయంలో వెలసిన శివలింగేశ్వరుడు

● వైభవంగా మహాశివరాత్రి ఉత్సవాలు

ఆలయంలో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఈ నెల 24 నుంచి 28వ తేదీ వరకు ఉత్సవాలు నిర్వహిస్తారు. జీవకోన మహాభారత వ్యవస్థాపక ధర్మకర్త అన్నా రామకృష్ణ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు. సోమవారం ధ్వజారోహణంతో ప్రారంభమై 25న గణపతి, నవగ్రహ, రుద్రహోమాలు, పూర్ణాహుతి, 26న ఏకకాల రుద్రాభిషేకం, ప్రదోషకాల అభిషేకాలు, నంది వాహనంపై శివపార్వతుల ఊరేగింపు ఉంటాయి. రాత్రి 12 గంటలకు మహాన్యాస పూర్వక లింగోద్భవకాల రుద్రాభిషేకం, మహా బిల్వార్చన ఉంటాయి. 27న స్వామి వారికి అన్నాభిషేకం, పార్వతీ పరమేశ్వరుల కల్యాణం ఉంటాయి. 28న త్రిశూలస్నానం, ధ్వజావరోహణంతో ఉత్సవాలు ముగుస్తాయి.



చంద్రగిరి కోట కొండపై సందర్శకులు

ప్రకృతి అందాలు ఆస్వాదించడం ఆనందదాయకం

చంద్రగిరి, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): ప్రకృతి అందాలను ఆస్వాదించడం ఎంతో ఆనందాన్ని ఇచ్చిందని సందర్శకులు అన్నారు. ఆదివారం తిరుపతి అడ్వెంచర్ బానిసలు ఆధ్వర్యంలో సందర్శకులు చంద్రగిరి కోట కొండల ట్రెక్కింగ్ నిర్వహించారు. ప్రతి సందర్శకుడికి మెంబర్‌షిప్ కార్డులు అందించారు. తిరుపతిలోని మెడిగో హాస్పిటల్ సహకారంతో సందర్శకుల కోసం అన్ని సౌకర్యాలు కలిగిన అంబులెన్స్‌ను ఏర్పాటు చేశారు. సందర్శకులు మాట్లాడుతూ వారంలో ఒక్క రోజైనా ఇలాంటి ట్రెక్కింగ్‌లో పాల్గొనడంతో వారమంతా పడిన కష్టాన్ని మరిచిపోయి సంతోషంగా గడిపినట్లు తెలిపారు. ఈ ట్రెక్కింగ్‌లో పాకాల, నగరి, తిరుపతి తదితర ప్రాంతాలకు చెందిన సందర్శకులు పాల్గొన్నారు.

హనుమంతు, గజ వాహనాలపై

కల్యాణ వెంకన్న అభయం

హనుమంతు వాహనంపై వెంకటాద్రిరాముడి అలంకరణలో దర్శనమిస్తున్న కల్యాణ వెంకన్న



చంద్రగిరి, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): శ్రీనివాసమంగాపురంలో వెలసివున్న కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆరో రోజు ఆదివారం స్వామివారు ఉదయం హనుమంతు వాహనం, రాత్రి గజ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్య కైంకర్యాలు నిర్వహించారు. అనంతరం స్వామివారి ఉత్సవమూర్తిని వెంకటాద్రిరాముడిగా అలంకరించి హనుమంతు వాహనంపై అధిష్ఠింపజేసి ఆలయ తిరుమాడ వీధుల్లో ఊరేగించారు. మధ్యాహ్నం 2 నుంచి 3 గంటల వరకు ఆలయ ప్రాగణంలోని కల్యాణ మండపంలో స్వామివారి ఉత్సవర్లకు సుగంధ భరితమైన పరిమళాలతో కూడిన చందనం ద్రవ్యాలతో వైభవంగా వసంతోత్సవం నిర్వహించారు. అర్చకులు, భక్తులు ఆహ్లాదకరంగా వసంతాలు(గంధం కలిపిన నీళ్ళు) చల్లుకున్నారు. రాత్రి స్వామివారి ఉత్సవమూర్తిని విశేషంగా అభయమూర్తిగా అలంకరించి, గజ వాహనంపై అధిష్ఠింపజేసి తిరుమాడ వీధుల్లో వృషభ, అశ్వ, గజరాజులు ముందు ఠీవిగా నడుస్తుండగా మేళతాళాలు, మంగళవాయిద్యాలు, చెక్క భజనలు, కోలాటాలు, కేరళ వాయిద్యాలు, గోవింద నామ స్మరణల నడుమ భక్తులకు దర్శనమిచ్చారు. ఈకార్యక్రమాలలో డిప్యూటీ ఈవో వరలక్ష్మి, కంకణ బట్టర్ నారాయణాచార్యులు, ఏఈవో గోపినాథ్, అర్చకులు పార్థసారథి, బాలాజీరంగాచార్యులు, శేషాచార్యులు, సూపరింటెండెంట్లు రమేష్‌కుమార్, రాజ్‌కుమార్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ మునికుమార్, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ ధనశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.







పాకాల పోలీస్ స్టేషన్ ఎదురు వీధిలోనే చోరీ యత్నం

పాకాల, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక పోలీస్ స్టేషన్ ఎదురుగా వున్న వీధిలో ఐదు చోట్ల శనివారం రాత్రి చోరీ యత్నం జరిగింది. పోలీస్ స్టేషన్ ఎదురుగా వున్న టీ దుకాణం, టైలరింగ్ షాప్, ప్రొవిజన్ స్టోర్, ఓ పార్టీ కార్యాలయం, బంగారు మెరుగు వేసే దుకాణంలో గుర్తుతెలియని వ్యక్తులు తాళాలు పగులగొట్టి చోరీ యత్నం చేశారు. ఆదివారం క్లూస్ టీం వచ్చి వీటిని పరిశీలించారు. పాకాల ఎస్సై సంజీవరాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అలాగే మూడు రోజుల క్రితం ఊట్లవారిపల్లె మెయిన్ రోడ్డులో ఓ ప్రొవిజన్ స్టోరు తాళాలు పగులగొట్టి చోరీకి పాల్పడ్డారు. వరుస చోరీలు జరుగుతుండడంతో స్థానికులు భయభ్రాంతులకు గురవుతున్నారు. పోలీసులు రాత్రి గస్తీ పెంచాలని కోరుతున్నారు.

క్రీడల్లో ఏపీకి అంతర్జాతీయ స్థాయి గుర్తింపే సీఎం లక్ష్యం

- **టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాలర్స్ దివాకర్‌రెడ్డి**
- **చంద్రగిరిలో ముగిసిన టెన్నిస్ బాల్ క్రికెట్ పోటీలు**



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాలర్స్ దివాకర్‌రెడ్డి

చంద్రగిరి, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): క్రీడారంగంలో ఏపీకి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకురావడమే సీఎం చంద్రబాబు లక్ష్యమని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాలర్స్ దివాకర్‌రెడ్డి అన్నారు. చంద్రగిరిలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో మూడు రోజులుగా జరుగుతున్న రాష్ట్ర స్థాయి టెన్నిస్ బాల్ క్రికెట్ పోటీలు ఆదివారంతో ముగిశాయి. రాష్ట్ర టెన్నిస్ బాల్ క్రికెట్ పోటీల్లో ఏపీలోని వివిధ జిల్లాల నుంచి మహిళలు 8 జట్లు, పురుషులు 16 జట్లు పాల్గొన్నాయి. హోరాహోరీగా సాగిన ఈపోటీల్లో పురుషుల విభాగంలో ప్రకాశం జిల్లా జట్టు, మహిళల విభాగంలో కడప జిల్లా జట్టు విజేతలుగా నిలిచారు. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాలర్స్ దివాకర్ రెడ్డి, తిరుపతి స్వీకార్ హాస్పిటల్ నుంచి డాక్టర్ ప్రశాంత్ విచ్చేశారు. డాలర్స్ దివాకర్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను యువత సద్వినియోగం చేసుకొని క్రీడల్లో రాణించాలని సూచించారు. అనంతరం విజేతలను అభినందించి బహుమతులు ప్రదానం చేశారు. ఈకార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ టెన్నిస్ బాల్ క్రికెటర్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ ఆర్‌డీ ప్రసాద్, చైర్మన్ పడగల సురేష్, స్టేట్ ఆర్గనైజేషన్ సెక్రటరీ రవి తదితరులు పాల్గొన్నారు.

తలకోనలో శివరాత్రి ఉత్సవాలు ప్రారంభం



పుట్టమన్ను తెస్తున్న ఎమ్మెల్యే నాని దంపతులు

ఎర్రావారిపాలెం, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి); తలకోన సిద్ధేశ్వర స్వామి ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఎమ్మెల్యే పులివర్తి నాని దంపతుల ఆధ్వర్యంలో అర్చకులు శాస్త్రోక్తంగా పుట్టమన్ను సేకరించారు. ఆలయంలోని యాగశాలలో పుట్టమన్నుతో కలశస్థాపన క్రతువును అర్చకులు నిర్వహించడంతో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. అంతకుముందు ఆలయాధికారులు ఎమ్మెల్యే నాని దంపతులకు, పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డికి పూర్ణ కుంభ స్వాగతం పలికారు. నాని దంపతులు స్వామి వారికి పట్టువస్త్రాలు సమర్పించారు. కలశ స్థాపనకు ముందు గోమాత పూజ చేశారు. కార్యక్రమంలో తలకోన ట్రస్ట్ చైర్మన్ సోమనాథరెడ్డి, ఈఓ రవీంద్రరాజు, నాయకులు దేశిరెడ్డి రఘునాథ, మహేష్, తహసీల్దార్ పరమేశ్వర స్వామి పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం, పోషకాల మణిహారం..

- **డీపీఎం షణ్ముగం**



చంద్రగిరి, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయం పోషకాల మణిహారమని డీపీఎం షణ్ముగం అన్నారు. ఆదివారం మండలంలోని కందులవారిపల్లెలో పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం మహిళా అధ్యయన విభాగం, రాష్ట్రీయ ఉచ్చతర్ శిక్షా అభియాన్(రూస)మంజూరు చేసిన ప్రాజెక్టులో భాగంగా సేంద్రియ, ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై మహిళా రైతులకు మూడు రోజుల పాటు శిక్షణ కార్యక్రమం ప్రారంభించారు. ఏపీ సీఎన్ఎఫ్ తిరుపతి జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ షణ్ముగం మాట్లాడుతూ సీఎం ఆకాంక్షించే స్వర్ణాంధ్ర విజన్‌ను గుర్తు చేశారు. ప్రతి ఇంటిలో చెత్తను ఎరువుగా ఉపయోగించి, ప్రకృతి వ్యవసాయ విధానంలో తప్పనిసరిగా కిచెన్ గార్డెన్, లేదా టెర్రస్ గార్డెన్ ఏర్పాటు చేయాలని సూచించారు.ప్రాజెక్ట్ ప్రిన్సిపాల్ ఇన్వెస్టిగేటర్ డాక్టర్ నీరజ మాట్లాడుతూ మహిళలకు ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై శిక్షణ అందజేసి తద్వారా వారిని సామాజిక వ్యాపారవేత్తలుగా తయారు చేయడమే ఈకార్యక్రమం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ఈకార్యక్రమంలో రైతు సాధికార సంస్థ సీనియర్ కన్సల్టెంట్ సురేంద్రరెడ్డి, అడిషనల్ డీపీఎం పట్టాభిరెడ్డి, కందులవారిపల్లి, నారావారిపల్లి, శేషాపురం గ్రామాలకు చెందిన మహిళా రైతులు పాల్గొన్నారు.

సరైన పోషకాహార నిర్వహణతో అధిక మామిడి దిగుబడి



నారావారిపల్లెలో రైతులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

చంద్రగిరి, ఫిబ్రవరి 23(ఆంధ్ర జ్యోతి): మామిడి చెట్లకు సరైన పద్ధతిలో పోషకాహార నిర్వహణతో అధిక మామిడి పండ్ల దిగుబడి పొందవచ్చని చంద్రగిరి ఉద్యాన విభాగాధికారిణి శైలజ తెలిపారు. మండలంలోని నారావారిపల్లి టీటీడీ కల్యాణ మండపంలో కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఆదివారం మామిడి రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. శైలజ మామిడి తోటలలో నిర్వహణ పద్ధతుల గురించి తెలిపారు. మెరుగైన మామిడి దిగుబడి కోసం పోషకాహార నిర్వహణపై రైతులకు అవగాహన కల్పించారు. కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ జోనల్ మేనేజర్ రమణారెడ్డి మాట్లాడుతూ కోరమండల్ సంస్థ మార్కెట్ వాటా, ఉత్పత్తుల గురించి వివరించారు. సీనియర్ వ్యవసాయ శాస్త్రవేత్త నర్సిరెడ్డి మామిడి పంటలో సమగ్ర పోషక నిర్వహణపై వివరించి, మంచి దిగుబడి కొరకు నానో డీఏపీ వాడవలసిన మోతాదు, కలిగే ప్రయోజనాల గురించి తెలిపారు. అక్యూస్ప్రే వాడటం వలన నాణ్యమైన పండ్ల దిగుమతి గురించి వివరించారు. ఈకార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్త అనిల్‌కుమార్ రెడ్డి, తిరుపతి ఏవో మురళి, నారావారిపల్లి, భీమవరం తదితర ప్రాంతాలకు చెందిన మామిడి రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



తిరుపతిలో ఆదివారం నిర్వహించిన గ్రూప్-2 మెయిన్స్ పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

సూర్య, చంద్రప్రభ వాహనాలపై పార్వతీ పరమేశ్వర్లు

చంద్రగిరి, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని తొండవాడ స్వర్ణముఖి నది ఒడ్డున వెలసిన అగస్త్యేశ్వరాలయ మహాశిరాత్రి ఉత్సవాలలో భాగంగా ఆదివారం ఉదయం సూర్యప్రభ, రాత్రి చంద్ర వాహనాలపై పార్వతీపరమేశ్వర్లు భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం 6 గంటలకు స్వామి వారికి రుద్రాభిషేకం నిర్వహించారు. ఆనందవల్లిదేవికి అభిషేకం చేశారు. శాఖాంబరి అలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు. 7.30 గంటలకు పార్వతీపరమేశ్వర్ల ఉత్సవర్లను విశేషంగా అలంకరించి సూర్యప్రభ వాహనంలో ఊరేగించారు. రాత్రి 7 గంటలకు ఉత్సవర్లను విశేషంగా అలంకరించి, చంద్రప్రభ వాహనంపై ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త మొగిలి రఘునాథరెడ్డి పాల్గొన్నారు.



గజవాహనంపై స్వామి వారు

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

తిరుచానూరు, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): తిరుచానూరులోని ప్రణీత్ ఫౌండేషన్, జూనియర్ ఛాంబర్ ఇంటర్నేషనల్ సంయుక్త ఆధర్యంలో తిరుచానూరులోని ఎడిఫై విద్యాసంస్థల్లో ఆదివారం నిర్వహించిన మెగా ఉచిత వైద్య శిబిరానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. సుమారు 500 పాల్గొని, పరీక్షలు చేయించుకున్నారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎడిఫై స్కూల్ అధినేత ప్రణీత్, పద్మావతి విద్యాసంస్థల అధినేత సులోచన, టాటా క్యాన్సర్ ఆస్పత్రి మెడికల్ డైరెక్టర్ డాక్టర్ ప్రశాంత్, జేసీఐ ప్రతినిధులు హర్షవర్ధన్ పాల్గొన్నారు.

నృత్యం అబ్బురం



తిరుచానూరు, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు రోడ్డులోని శిల్పారామంలో ఆదివారం వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. 70 మంది కళాకారులు ప్రదర్శనలు చేశారు. బెంగళూరుకు చెందిన బృంద, సుష్మ, శ్రేష్ఠ, శిల్ప, మధు, ప్రజ్ఞ బృందాల భరతనాట్యం, చిత్తూరుకు చెందిన వనజాక్షి బృందం కూచిపూడి నృత్య ప్రదర్శనలు అబ్బురపరిచాయి. బృందకథ గణేశకౌతవం, అలరింపు, కృష్ణ లీలలు, అష్టపది, జాతీశ్వరం, అన్నమయ్య వంటి కీర్తనలకు నాట్య ప్రదర్శన చేశారు. వీరిని శిల్పారామం ఏవో ఖాదరవల్లి సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు.



అవగాహన కల్పిస్తున్న ఉప సర్పంచ్ సునీల్‌చౌదరి, కార్యదర్శి మాధవి

తడి, పొడి చెత్తను వేర్వేరుగా అందించండి

తిరుపతిరూరల్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం శ్రీనివాసపురం గ్రామ పంచాయతీ పరిధిలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రలో భాగంగా రెండవ రోజు ఆదివారమూ ఇంటింటికీ తిరిగి తడి, పొడిచెత్త, ప్రమాదకర వ్యర్థాలను ఇంటివద్దే వేరుచేసి గ్రీన్ అంబాసిడర్లకు అందించాలని ప్రజలకు అవగాహన కల్పించారు. సర్పంచ్ పద్మావతి, ఉప సర్పంచ్ సునీల్‌చౌదరి, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి పి.మాధవి, సచివాలయ ఉద్యోగులు, బిల్ కలెక్టర్, సిబ్బంది పాల్గొన్నారు.



వర్సిటీ ప్రధాన గేటు ఎదుట నిరసన తెలుపుతున్న విద్యార్థులు

కొనసాగిన వెటర్నరీ విద్యార్థుల సమ్మె

తిరుపతిరూరల్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): వైద్య విద్యార్థులతో సమానంగా స్టైఫండ్ పెంచాలని ఎస్వీ వెటర్నరీ కళాశాల విద్యార్థులు చేపట్టిన సమ్మె ఆదివారమూ కొనసాగింది. వర్సిటీ ప్రధానగేటు వద్ద దీక్షా శిబిరంలో బైఠాయించి నిరసన తెలిపారు. వెటర్నరీ డీన్ ప్రొఫెసర్ డాక్టర్ కె.వీరబ్రహ్మయ్య, ప్రొఫెసర్ జీఆర్కే శర్మ అక్కడికి చేరుకుని సమ్మె విరమించి తరగతులకు హాజరుకావాలని సూచించారు. ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీ వచ్చేవరకు దీక్షను విరమించేదిలేదని విద్యార్థులు స్పష్టం చేశారు. యూజీ, పీజీ, పీహెచ్‌డీ విద్యార్థులకు స్టైఫండ్ పెంచేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు.

నేడు మాట-పాట కార్యక్రమం

తిరుపతి రూరల్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం తనపల్లె శ్రీవారి టెంపుల్ బెల్స్ లేఅవుట్‌లోని శ్రీనిలయంలో సోమవారం సాయంత్రం 6.30 గంటలకు మాట-పాట కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు డాక్టర్ నాదెండ్ల శ్రీమన్నారాయణ పేర్కొన్నారు. ప్రొఫెసర్ గార్లపాటి దామోదరనాయుడు అధ్యక్షతన జరిగే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ సినీ గేయ రచయిత డాక్టర్ సుద్దాల అశోక్‌తేజ, ఆత్మీయ అతిథిగా డాక్టర్ గుండ్రాతి వెంకట నారాయణ, గౌరవ అతిథిగా డాక్టర్ నన్నం ధర్మయ్య, ప్రత్యేక అతిథిగా డాక్టర్ జలగం రామాంజులు హాజరవుతారని తెలిపారు.

క్రీడలతో మానసిక ఉత్తేజం



ప్రారంభ సభలో ప్రసంగిస్తున్న పద్మావతి వర్సిటీ వీసీ ప్రొఫెసర్ ఉమ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): క్రీడా సాంస్కృతిక పోటీల్లో పాల్గొనడం ద్వారా ఉద్యోగులకు శారీరక, మానసిక ఉత్తేజం కలుగుతుందని పద్మావతి యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ వెన్నం ఉమ పేర్కొన్నారు. ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ యూనివర్సిటీ పరిధిలోని ఉద్యోగులకు క్రీడా సాంస్కృతిక పోటీలు ఆదివారం ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు కొనసాగే ఈ పోటీలను వ్యవసాయ కళాశాల మైదానంలో పద్మావతి వర్సిటీ వీసీ ప్రొఫెసర్ ఉమ ప్రారంభించారు. వీసీ మాట్లాడుతూ యూనివర్సిటీలు ఈ తరహా పోటీలు నిర్వహించడం మంచి సంప్రదాయమన్నారు. వ్యవసాయ వర్సిటీ స్టూడెంట్స్ డీన్ కరుణాసాగర్ మాట్లాడుతూ ఉద్యోగుల శారీరక, మానసిక వికాసం కోసం ఈ పోటీలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. పోటీల ప్రారంభ సూచికగా మైదానంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఇంటర్నేషనల్ ప్రోగ్రామ్స్ డైరెక్టర్ మునిరత్నం, ఆర్ఏఆర్ఎస్ ఏడీ సుమతి, అసోసియేట్ డీన్ ఎంవీ రమణ, ఫిజికల్ డైరెక్టర్ రవికాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో జస్టిస్ వెంకటరమణ



తిరుమల, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : మధ్యప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ దుప్పల వెంకటరమణ ఆదివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో ఆలయంలోకి వెళ్లిన ఆయన ముందుగా ధ్వజస్తంభానికి మొక్కుకుని, తర్వాత గర్భాలయంలోని మూలమూర్తిని దర్శించుకున్నారు. ఈ మేరకు జస్టిస్ వెంకటరమణకు రంగనాయక మండపంలో వేద పండితులు ఆశీర్వచనం చేయగా అధికారులు లడ్డూప్రసాదాలు అందజేశారు.

శ్రీవారి సేవలో రాయపాటి సాంబశివరావు



తిరుమల, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎంపీ రాయపాటి సాంబశివరావు ఆదివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్‌లో కుటుంబ సమేతంగా ఆలయంలోకి వెళ్లి శ్రీవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా రాయపాటికి ఆలయ సిబ్బంది లడ్డూప్రసాదాలు అందజేశారు. అనంతరం కుటుంబ సభ్యులతో కలిసి అఖిలాండం వద్ద 1,001 కొబ్బరికాయలు సమర్పించారు. ఆయన వెంట టీడీపీ నేత అజయ్ ప్రతాప్ ఉన్నారు.

బీసీలకు రాజ్యాధికారం కల్పించాలి



నియామక పత్రాలు అందజేస్తున్న వెంగళరావు యాదవ్

తిరుపతి(ఎమ్మార్‌పల్లె), ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): బీసీలకు రాజ్యాధికారం కల్పించాలని జాతీయ బీసీ సంఘర్షణ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు లాక వెంగళరావు యాదవ్ కోరారు. 139 బీసీ కులాల వారిని రాజకీయంగా వాడుకుంటున్నారే తప్ప వారి అభ్యున్నతికి ఎవరూ తోడ్పడడం లేదన్నారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా జాతీయ బీసీ సంక్షేమ సంఘ జిల్లా కార్యవర్గాన్ని ప్రకటించారు. అధ్యక్షుడిగా పూల రాజేష్‌యాదవ్, జనరల్ సెక్రటరీగా రాజేష్ ఆచారి, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలిగా బుర్రా సావిత్రమ్మ, కార్యదర్శిగా విజయలక్ష్మిని నియమించారు. కార్యక్రమంలో బీసీ నాయకులు వెంకట్రావు, శంకర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టులకు వైద్య సేవలు



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ సునందకుమార్‌రెడ్డి

తిరుపతి(ఎంఆర్‌పల్లె), ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): తిరుపతి ప్రెస్‌క్లబ్ సభ్యులు, వారి కుటుంబీకులకు ఆదివారం ఆస్టర్ నారాయణాద్రి వారిచే మెగా వైద్యశిబిరం నిర్వహించారు. వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. జర్నలిస్టులు విధుల్లో భాగంగా తమ ఆరోగ్యంపై నిర్లక్ష్యం వహించకుండా సమయానికి తిని, తగినంత నిద్ర పోవాలని ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ సునందకుమార్‌రెడ్డి సూచించారు. నడక తప్పనిసరని, పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. ఆస్టర్ నారాయణాద్రిలో జర్నలిస్టులకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఆస్పత్రి చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ డాక్టర్ శ్రీధర్‌ముని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు మురళి, కార్యదర్శి బాలచంద్ర, కార్యవర్గ సభ్యులు, జర్నలిస్టులు, వైద్యులు పాల్గొన్నారు.

తిరుపతి

శ్రీవారి సర్వదర్శనానికి 13 గంటలు

తిరుమల, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వర స్వామి దర్శనానికి 13 గంటల సమయం పడుతోంది. ఆదివారం సాయంత్రం 5 గంటల వరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని కంపార్టుమెంట్లు, నారాయణగిరి షెడ్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

శుక్రవారం నాటి హుండీ ఆదాయం: రూ.3.39 కోట్లు
శనివారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 78,110
తలనీలాలు సమర్పించినవారు: 30,020

మాజీ మంత్రి యనమలకు సన్మానం



యనమలను సత్కరిస్తున్న హరికృష్ణ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మాజీ ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడును ఎన్వీయూ ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ పాకనాటి హరికృష్ణ సన్మానించారు. తిరుపతిలో ఓ ప్రైవేట్ కార్యక్రమానికి హాజరైన యనమలను హరికృష్ణ మర్యాద పూర్వకంగా కలిశారు. శాలువాతో సత్కరించారు. యూనివర్సిటీ పరిస్థితులపై యనమల ఆరా తీశారు. అధ్యాపక పోస్టుల భర్తీ విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళతానని తెలిపారు.

డాక్టరేట్ ప్రదానం



సృజన

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): కుప్పంలోని ద్రవిడ యూనివర్సిటీ కెమిస్ట్రీ పరిశోధకురాలు పి. సృజన డాక్టరేట్ పొందారు. డెవలప్‌మెంట్ అండ్ వ్యాలిడేషన్ ఆఫ్ హై పర్ఫార్మెన్స్ లిక్విడ్ క్రొమెటోగ్రఫీ (హెచ్‌పీఎల్‌సీ) మెథడ్ ఫర్ ద అనాలసిస్ ఆఫ్ న్యూ ఫార్మోష్యూటికల్ కాంపౌండ్ (గ్రడ్స్) అంశంపై డాక్టర్ టి.శోభారాణి పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేశారు. కాగా, సృజన ప్రస్తుతం తిరుపతిలోని ఎస్వీఎస్ ఆర్ట్స్ కాలేజీలో కెమిస్ట్రీ అధ్యాపకురాలిగా పనిచేస్తున్నారు.

అందరివాడు అంబేడ్కర్ : పనబాక

తిరుపతి(ఆటోనగర్), ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): దేశంలో అన్ని వర్గాల ప్రజలు ఆరాధించే వ్యక్తి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని కేంద్ర మాజీ మంత్రి, టీటీడీ పాలకమండలి సభ్యురాలు పనబాక లక్ష్మి పేర్కొన్నారు. తిరుపతి ప్రధాన తపాలా కార్యాలయ ప్రాంగణంలో ఉద్యోగులు ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని ఆమె ఆదివారం ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ తపాలా కార్యాలయ ప్రాంగణంలో గొప్ప వ్యక్తి విగ్రహాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పనబాక కృష్ణయ్య, నాయకులు పరమశివం, ప్రసాదరావు, తపాలా సంఘం నాయకులు ఐతేపల్లి రవి, పల్లం రెడ్డెప్ప, పి.మునిరాజ పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి సైనికుల్లా పనిచేద్దాం

- వైసీపీ జిల్లా అధ్యక్షుడు కరుణాకరరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న కరుణాకరరెడ్డి

తిరుపతి(జీవకోన), ఫిబ్రవరి23(ఆంధ్రజ్యోతి): పార్టీ బలోపేతానికి సైనికుల్లా పనిచేద్దామని వైసీపీ జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం పద్మావతీపురంలోని పార్టీ కార్యాలయంలో ఉమ్మడి జిల్లాలోని వైసీపీ అనుబంధ విభాగాల అధ్యక్షులతో ఆయన సమావేశమయ్యారు. పార్టీలో పదవులు పొందడం కాదని, వాటిని బాధ్యతగా స్వీకరించి పార్టీ బలోపేతానికి, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని అన్నారు. ప్రభుత్వ అరాచకాలను ఎండగడుతూ పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. సమావేశంలో చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి పాల్గొన్నారు.

చేపల మార్కెట్ కిటకిట





తిరుపతి(లీలామహల్), ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): బర్డ్‌ఫ్లూ వదంతుల నేపథ్యంలో మాంసాహార ప్రియులు కొన్ని రోజులుగా చికెన్ తినడం మానేశారు. ప్రత్యామ్నాయంగా స్తోమత ఉన్నవారు మటన్ వైపు మొగ్గు చూపగా ఎక్కువ మంది చేపలను ఆశ్రయిస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం లీలామహల్, పద్మావతీపురం చేపల మార్కెట్లు కిటకిటలాడాయి. దీంతో చేపల రేట్లు కూడా ఒకింత పెరిగాయి. రొయ్యలు కిలో రూ.300 నుంచి రూ.550 వరకు, పీతలు రూ.300, గండి రూ.180 నుంచి రూ.220, వంజ్రం రూ.180, సముద్రపు కొడువ రూ.500, కొరమీను రూ.550 పలికాయి. అదే సమయంలో కొన్ని వారాల క్రితం రూ.270వరకు పలికిన చికెన్ కిలో ధర ప్రస్తుతం రూ.100 నుంచి రూ.130కి పడిపోయింది. ధర తగ్గినా చికెన్ దుకాణాల వద్ద జనం కనిపించలేదు. మటన్ రూ.880 పలికినా విక్రయాలు జోరుగా సాగాయి.

రోడ్డుపై బారులుతీరిన వాహనాలు

లీలామహల్ చేపల మార్కెట్ వద్ద ఆదివారం వాహనాలు బారులుతీరాయి. చేపల కొనుగోలుదారులు ద్విచక్ర వాహనాలు, ఆటోల్లో తరలివచ్చి రోడ్డుపైనే అడ్డుగా పెట్టడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సంబంధిత అధికారులు దృష్టి సారించాల్సి ఉంది.

ఆదివారం అమ్మకు తోడుగా...



రెక్కాడితే కానీ డొక్కాడని కుటుంబాలు వారివి. కుటుంబ పోషణకు, బిడ్డ చదువుకు అయ్యే ఖర్చుల కోసం ఆమె ప్రతిరోజూ తిరుపతి లీలామహల్ సమీపంలోని చేపల మార్కెట్ వద్ద పనిచేస్తుంది. తల్లి కష్టాన్ని గమనించే కూతురు ఆదివారం సెలవు రోజు కావడంతో ఆమెకు చేదోడుగా నిలవడం పలువురిని ఆలోచింపజేసింది. **- తిరుపతి (లీలామహల్)**

పట్టించుకోండి సారూ..!

రోడ్డుకడ్డుగా విద్యుత్ స్తంభాలు



సత్యనారాయణపురం సర్కిల్‌లో రద్దీ

సత్యనారాయణపురం సర్కిల్‌లో విద్యుత్ స్తంభాలు అడ్డుగా ఉండడంతో తరచూ ట్రాఫిక్ సమస్య ఎదురవుతోంది. సర్కిల్‌ను విస్తరించినా విద్యుత్ స్తంభాలను పక్కకు తొలగించకపోవడంతో వాహన రాకపోకలకు అంతరాయం కలుగుతోంది.ఉదయం, సాయంత్రం సమయాల్లో ట్రాఫిక్ ఎక్కువగా ఉండడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. వాటిని తొలగించి పక్కన ఏర్పాటు చేయాలని వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు. **- తిరుపతి (జీవకోన)**

బాలికతో అసభ్య ప్రవర్తన

- పోలీసుల అదుపులో నిందితుడు

తిరుపతి (నేరవిభాగం), ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): 10 ఏళ్ల బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిని అలిపిరి పోలీసులు ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. సీఐ రాంకిషోర్ వివరాల మేరకు.. రాజీవ్‌నగర్ ప్రాంతానికి చెందిన బాలిక ఇంటి సమీపంలో పిల్లలతో ఆడుకుంటోంది. అదే ప్రాంతానికి చెందిన రమణాచారి మద్యం మత్తులో ఆ చిన్నారిని బలవంతంగా తన ఇంట్లోకి తీసుకెళ్లి అసభ్యంగా ప్రవర్తించాడు. లైంగిక వేధింపులకు గురిచేశాడు. బాలిక అతని నుంచి తప్పించుకుని పెద్దగా కేకలు వేస్తూ ఇంటికి చేరుకుని తల్లిదండ్రులకు విషయం చెప్పింది. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు విచారణ జరిపిన పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు.

ఇండియా విజయంపై సంబరాలు



మిఠాయిలు పంచుతూ సంబరాలు చేసుకుంటున్న బీజేపీ నేతలు

తిరుపతి(ఉపాధ్యాయనగర్), ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): దుబాయ్‌లో జరుగుతున్న ఛాంపియన్స్ ట్రోఫీ క్రికెట్ టోర్నమెంట్‌లో పాకిస్థాన్‌పై భారత్ జట్టు విజయం సాధించడంతో బీజేపీ నాయకులు తిరుపతిలో సంబరాలు చేసుకున్నారు. ఆదివారం రాత్రి నాలుగుకాళ్ల మండపం వద్ద జాతీయ పతాకాలతో ప్రదర్శన నిర్వహించారు. మిఠాయిలు పంచిపెడుతూ ఆనందం పంచుకున్నారు. బీజేపీ నాయకులు గుండాల గోపీనాథరెడ్డి, దీపక్ యాదవ్, సుబ్రహ్మణ్యంరెడ్డి, కిరణ్ మోహన్, రాజశేఖర్‌రెడ్డి, భాగవతులు, సాయి కిరణ్, శ్రీనివాసులు, భాస్కర్, రమేష్, హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రూపు-2 పరీక్షలకు కట్టుదిట్టమైన భద్రత



పరీక్ష కేంద్రాలను తనిఖీ చేస్తున్న ఎస్పీ హర్షవర్ధనరాజు

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో ఆదివారం జరిగిన గ్రూపు-2 పరీక్షలకు పోలీసులు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశారు. హాల్లోకి వెళ్లే ప్రతి ఒక్కరినీ తనిఖీ చేసి అనుమతించారు. అన్ని పరీక్ష కేంద్రాలను ఎస్పీ హర్షవర్ధన రాజు తనిఖీ చేశారు.

ప్రకృతి సంపద శేషాచల కొండలు

- పుస్తక పరిచయ సభలో వక్తలు



పుస్తకాన్ని పరిచయం చేస్తున్న దృశ్యం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): శేషాచల కొండలు మనకు ప్రకృతి ప్రసాదించిన సంపదని వక్తలు పేర్కొన్నారు. శ్వేత మాజీ డైరెక్టర్ భూమన్ రాసిన శేషాచల కొండ కోనల్లో పుస్తక పరిచయ కార్యక్రమం తిరుపతిలోని దివ్యారామంలో ఆదివారం నిర్వహించారు. తిరుపతి ట్రెక్కింగ్ గ్రూప్ బీవీ రమణ మాట్లాడుతూ శేషాచల కొండల్లోని ఆధ్యాత్మిక, ప్రకృతి అందాలను ఈ పుస్తకం తెలియజేస్తుందన్నారు. ఈ పుస్తకం చదివితే శేషాచల కొండల్లో సంచరించినంతటి అనుభూతి కలుగుతుందన్నారు. పుస్తక రచయిత భూమన్ మాట్లాడుతూ ప్రకృతితో మమేకం కావాలనే విషయాన్ని ఈ పుస్తకం ద్వారా తెలియజేశానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈతరం కవితా వేదిక అధ్యక్షుడు తోట వేంకటేశ్వర్లు, ట్రెక్కర్స్ రమణ, బాలు తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి శివరాత్రి ఉత్సవాలు

తిరుచానూరు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): తిరుచానూరు పంచాయతీ యోగిమల్లవరంలో కామాక్షాంబ సమేత పరాశరేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం నుంచి నాలుగు రోజులు మహాశివరాత్రి ఉత్సవాలు అంగరంగా వైభవంగా నిర్వహించనున్నారు. మంగళవారం నందీశ్వరుడికి ప్రదోష అభిషేకం, బుధవారం విశేష, ప్రత్యేక అభిషేకం, రుద్రాభిషేకం నిర్వహించనున్నారు. గురువారం ఏకాంత సేవ, అన్నదానం, శుక్రవారం కల్యాణోత్సవం ఉంటాయని అర్చకులు తెలిపారు.

ఐఐటీలో ముగిసిన తిరుత్సవ్ 2కే25

- సృజనాత్మకత, సాంకేతిక మేళవింపుతో విద్యార్థుల సందడి
- జోష్ నింపిన మూడ్రోజుల టెక్నో కల్చరల్ ఫెస్ట్



సంగీత విభావరిని తిలకిస్తున్న విద్యార్థులు

ఏర్పేడు/తిరుపతిరూరల్, ఫిబ్రవరి23(ఆంధ్రజ్యోతి): ఏర్పేడులోని ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ) వేదికగా మూడు రోజులుగా తిరుత్సవ్-2కే25 పేరిట నిర్వహించిన టెక్నో అండ్ కల్చరల్ ఫెస్ట్ ఆదివారంతో ముగిసింది. దీనిలో భాగంగా మూడు రోజులపాటు పలువురు విద్యార్థులు తమలో అంతర్లీనమైన ప్రతిభా నైపుణ్యాలను ప్రదర్శించి అద్భుత ప్రదర్శనలు చేశారు సృజనాత్మకత, సాంకేతిక సాంస్కృతికల మేళవింపుగా సాగిన తిరుత్సవ్ విద్యార్థుల్లో జోష్ నింపింది. చివరి రోజు ఆదివారం పలు అంశాలపై విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. ట్రెజర్ హంట్ అడ్వెంచర్ పోటీలో విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని లక్ష్యాన్ని చేరుకున్న విధానం ఆకట్టుకుంది. విద్యార్థుల్లో భాషణంపై స్పష్టతను పరీక్షించేలా సాగిన పాప్ కల్చర్ క్విజ్ పోటీలు ఆలోచింపచేశాయి. క్రికెట్ ఓ మానియా పాల్గొన్న విద్యార్థుల నుంచి మాక్ ఐపీఎల్ వేలం పాట నిర్వహించారు. అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి దొంగను పట్టుకునే విధానంపై ఎస్కేప్ రూమ్, టెక్ హీస్ట్ పోటీల్లో విద్యార్థులు ప్రతిభ చాటారు. ఇక టెక్నికల్ సదస్సులో అధ్యాపకుల మార్గదర్శకంలో నూతన ఆవిష్కరణల రూపకల్పన దిశగా నిర్వహించారు. డైరెక్టర్ ప్రొఫెసర్ కేఎస్ సత్యనారాయణ, పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.



తరగతి గదిలో విద్యార్థులు

ఉర్రూతలూగించిన సంగీత విభావరి

సినీ నేపథ్య గాయకుడు హరిచరణ్, గాయని శిరీష, ఆకాశ్ బృంద నేతృత్వంలో నిర్వహించిన సంగీత విభావరి ఉర్రూతలూగించింది. సినీ గీతాలకు విద్యార్థులు అడుగులు కదుపుతూ డాన్సులు చేసి సందడి చేశారు. కేరింతలు చప్పట్లతో సంగీత విభావరి హోరెత్తింది.

సీఎం చంద్రబాబుకు ఘన స్వాగతం

రేణిగుంట, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబుకు ఘన స్వాగతం లభించింది. యాదవ కార్పొరేషన్ చైర్మన్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు నరసింహ యాదవ్ తనయుడు వివాహానికి హాజరయ్యేందుకు ప్రత్యేక హెలికాప్టర్లో గన్నవరం నుంచి ఆదివారం మధ్యాహ్నం తిరుపతి విమానాశ్రయం చేరుకున్న ఆయనకు చంద్రగిరి, నగరి, సత్యవేడు, పలమనేరు, గంగాధర నెల్లూరు ఎమ్మెల్యేలు పులివర్తి నాని, భానుప్రకాష్, కోనేటి ఆదిమూలం, అమరనాథరెడ్డి, థామస్, టీటీడీ బోర్డు సభ్యుడు వైద్యం శాంతారాం, డీఐజీ షిమోషి బాజ్‌పాయ్, కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ హర్షవర్ధన్ రాజు, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ మౌర్య, జాయింట్ కలెక్టర్ శుభం బన్సాల్, టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి, ట్రైనీ ఎస్పీ హేమంత్, ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి స్వాగతం పలికారు.







సీఎంకు స్వాగతం పలుకుతున్న కలెక్టర్, ఎస్పీ - విమానాశ్రయం బయట ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న సీఎం - వీడ్కోలు పలుకుతున్న ఎమ్మెల్యేలు నాని, అమరనాథరెడ్డి

పుత్తూరు వార్తలు

పాఠశాలల పునర్విభజనలో తల్లిదండ్రుల అభిప్రాయాలు తీసుకోండి


విద్యాశాఖాధికారులతో ఎమ్మెల్యే భానుప్రకాష్

పుత్తూరు, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): పాఠశాలల పునర్విభజనను తల్లిదండ్రుల అభిప్రాయాల మేరకు తీసుకోవాలని విద్యాశాఖాధికారులను ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ కోరారు. పుత్తూరు డివిజన్ ఉప విద్యాశాఖాధికారి ప్రభాకర్‌రాజు ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని ఐదు మండలాల ఎంఈవోలు ఆదివారం ఎమ్మెల్యేని మర్యాదపూర్వకంగా కలిసి ప్రాథమిక కసరత్తు గురించి వివరించారు. జీవో 112కు ప్రత్యామ్నాయంగా పునర్విభజన విషయమై అధికారులకు ఎమ్మెల్యే దిశానిర్దేశం చేశారు. టెన్త్ విద్యార్థులకు మంచి తర్ఫీదును ఇచ్చి ఉత్తమ ఫలితాలను సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తిరుమలరాజు, బాలసుబ్రమణ్యం, శ్రీదేవి, నమశ్శివాయ, హరిప్రసాద్‌వర్మ, పద్మావతి, తులసిరాము పాల్గొన్నారు.

ఎర్రన్నాయుడికి ఘన నివాళి


నివాళి కార్యక్రమంలో టీడీపీ నాయకులు

పుత్తూరు అర్బన్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): తెలుగు వారి కీర్తిని దశ దిశలా వ్యాపింప చేసిన ఘనత దివంగత కేంద్ర మాజీ మంత్రి కింజరపు ఎర్రన్నాయుడికే దక్కిందని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పోతుగుంట విజయ్‌బాబు అన్నారు. ఆదివారం ఎంబీ రోడ్డులోని కార్యాలయంలో ఎర్రన్నాయుడి 68వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఆంధ్రప్రదేశ్ వాణిని లోక్‌సభలో వినిపించిన నాయకుడిగా స్ఫూర్తిని నింపారని కొనియాడారు. టీడీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి ధనపాల్, పరమేశ్వరమంగళం పీఏసీఎస్ మాజీ ఛైర్మన్ శేఖర్ నాయుడు, నాయకులు దాసరి విజయ్ చౌదరి, కుమార్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ భాస్కర్, మణికంఠ, కోటయ్య, మేఘనాథ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు బీసీ కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు

వడమాలపేట,ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో బీసీ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు సోమవారం మండల పరిషత్ కార్యలయంలో బ్యాంకర్లు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని ఎంపీడీవో శేషగిరిరావు చెప్పారు. మండల పరిధిలోని ఐదు బ్యాంకుల అధికారుల పాల్గొంటున్నట్లు చెప్పారు. లబ్ధిదారులు సంబంధిత ధృవీకరణపత్రాలతో హాజరు కావాలని కోరారు.

వైభవంగా పార్వతీపరమేశ్వరుల కల్యాణం

వడమాలపేట, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉమా మహేశ్వర స్వామి ఆలయంలో పార్వతీపరమేశ్వరుల కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఓబీఆర్ కండ్రిగ సమీపంలోని అరుణగిరి వద్ద ఆలయ పంచమ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం భక్తుల శివనామ స్మరణల నడుమ కళ్యాణం నిర్వహించారు.ఉదయం గోపూజ,స్వామి,అమ్మ వార్లకు అభిషేకం నిర్వహిరచారు.ఉత్సవ విగ్రహాలను పట్టుపీంబరాలు,పూల మాలలతో అలంకరించారు. తిరుపతికి చెందిన ప్రమీలాదేవి,సుధాకర్‌రావు ఉభయదారులుగా వ్యవహరించారు. సాయంత్రం శివ పార్వతులను గ్రామంలో ఊరేగించారు. భక్తులకు తీర్థ, ప్రసాదాలు అందజేశారు.

పారిశుధ్య సమస్యలను పరిష్కరిస్తాం

జనసేన నాయకుల హామీ

రేణిగుంట, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): పంచాయతీ పరిధిలో పారిశుధ్య సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని జనసేన నాయకుడు నగరం భాస్కర్ తెలిపారు. ఆదివారం సాయంత్రం పాంచాలీనగర్‌లో పార్టీ నాయకులతో కలిసి పర్యటించారు. వీధి దీపాలు, డ్రైనేజీ కాలువలు, పారిశుధ్య నిర్వహణ, రోడ్లపై గోతులు తదితరు సమస్యలను నాయకుల దృష్టికి తీసుకువెళ్లారు. నాగరాజు, భాగ్యలక్ష్మి, బాలాజీ, జగదీష్, భాష, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

చేపలకు పెరిగిన గిరాకీ


చేపలు కొనుగోలు చేస్తున్న ప్రజలు

రేణిగుంట, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): మాంసం ప్రియులు చేపల కోసం ఎగబడ్డారు. బర్డ్ ఫ్లూ నేపథ్యంలో చికెన్ కొనేందుకు ప్రజలు సాహసం చేయలేదు. దీంతో పట్టణంలో చికెన్ దుకాణాల్లో అంతంత మాత్రమే వ్యాపారం జరుగుతోంది. మరోపక్క మటన్‌కు గిరాకీ పెరగడంతో గతంలో కిలో రూ.800 ఉండగా ఒక్కసారిగా రూ.60 పెంచేశారు. కిలో రూ.150 విక్రయిస్తుండడంతో పట్టణంలో పలుప్రాంతాల్లో చేపల కోసం ఎగబడ్డారు.

పారిశుధ్య కార్మికులకు సహకరించండి

జిల్లా పంచాయతీ అధికారి సుశీలాదేవి

రేణిగుంట, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి) : పంచాయతీవాసులు పారిశుధ్య కార్మికులకు సహకరించాలని జిల్లా పంచాయతీ అధికారి సుశీలాదేవి సూచించారు. ఆదివారం మండల పరిధిలోని పాపానాయుడుపేట పంచాయతీలో చెత్తసేకరణ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రామంలోని పలు వీధులను తిరిగి శుభ్రతను పరిశీలించారు. ఈ సందర్భంగా వీధుల్లోని మహిళతో డీపీవో మాట్లాడుతూ తడి, పొడి చెత్త రెండు కలిపి వేయడం వల్ల పారిశుధ్య కార్మికులు ఇబ్బందులతోపాటు ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయన్నారు. ప్రతి మహిళ ఇంట్లో సేకరణకు ప్రత్యేకంగా బుట్టను ఏర్పాటు చేసుకుని పొడి చెత్తవేరుగా తడి చెత్త వేరుగా ఇవ్వాలని సూచించారు. ముఖ్యంగా మహిళలు అధికంగా ప్లాస్టిక్ కవర్ల ద్వారా చెత్త వేయరాదని, ప్లాస్టిక్ వల్ల కలిగే నష్టాలను వివరించారు. గ్రామ ప్రజలు పంచాయతీకి సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌పీవో ప్రభురెడ్డి, ఈవోపీఆర్డీ రమణకుమార్, సెక్రటరీ హరికృష్ణ, టీడీపీ నాయకులు కృష్ణప్ప మొదలియార్, జాఫర్, మురుగన్ కృష్ణయ్య, ముత్తప్ప మొదలియార్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని మహిళ దుర్మరణం

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని మహిళ దుర్మరణం చెందిన ఘటన ఆదివారం రాత్రి తొట్టంబేడు మండలం పొయ్యకొత్తూరు వద్ద జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. రహదారిపై నడిచి వెళుతున్న మహిళను గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి వెళ్లిపోయింది. ఈ ఘటనలో మహిళ శరీరం గుర్తుపట్టలేని విధంగా ఛిద్రమైపోయింది. సమాచారం తెలుసుకున్న తొట్టంబేడు పోలీసుల ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహం భాగాలను మూటకట్టి పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రి మార్చూరీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

గూడూరు

సూళ్లూరుపేట/వెంకటగిరి

ఈతకు వెళ్లి యువకుడి మృతి


మృతిచెందిన వినీల్

నాయుడుపేట, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కూచివాడపాళెం గ్రామానికి చెందిన వినీల్(19) స్వర్ణముఖి నదిలో ఈతకు వెళ్లి మృతి చెందాడు. ఆదివారం వినీల్ స్నేహితులతో కలిసి స్వర్ణముఖినదిలోకి ఈతకు వెళ్లాడు నదిలో లోతట్టు ప్రాంతంలోకి వెళ్లిన వినీల్ అకస్మాత్తుగా మునిగి మృతి చెందాడు. గమనించి స్నేహితులు వెంటనే గ్రామస్తులు, కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న గ్రామస్తులు వినీల్ మృతదేహాన్ని నదిలో నుంచి బయటకు తీశారు.

మామిడికాలువలో గుర్తుతెలియని మృతదేహం

నాయుడుపేట టౌన్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట - మేనకూరు పారిశ్రామికవాడ సమీపంలో ఉన్న మామిడి కాలువలో గుర్తుతెలియని మృతదేహం లభ్యమైంది. ఆదివారం ఉదయం బహిర్భూమికి వెళ్లిన మేనకూరువాసులు మామిడికాలువలో మృతదేహం ఉండడాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. అర్బన్ సీఐ బాబి సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. వివరాలు నమోదు చేసుకుని మృతదేహాన్ని నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేపట్టారు.

కండలేరు వాగుపై లోలెవల్ కాజ్‌వే నిర్మించండి

- శ్మశానానికి, పొలాలకు వెళ్లడానికి అవస్థలు
- తాత్కాలికంగా మట్టిరోడ్డు నిర్మించుకున్న రైతులు


కండలేరువాగులో రైతులు ఏర్పాటు చేసుకుని ఉన్న మట్టిరోడ్డు

గూడూరు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): గూడూరు మండలంలోని సంతదాసుపల్లి వద్ద కండలేరువాగుపై లోలెవల్ కాజ్‌వేను నిర్మించాలని రైతులు కోరుతున్నారు. వాగు అవతల వైపు ఉన్న శ్మశానవాటికకు, పొలాలకు వెళ్లాలన్నా ఇబ్బందులు పడాల్సి వస్తోంది. దీంతో రైతులే స్వయంగా వాగుపై మట్టిరోడ్డును తాత్కాలికంగా నిర్మిచుకున్నారు. మండలంలోని సంతదాసుపల్లి వద్ద కండలేరువాగు ప్రవహిస్తోంది. పెంచలకోన ప్రాంతం నుంచి మనుబోలు మండలం మీదుగా తిప్పగుంటపాళెం గ్రామంలోని కండలేరు క్రీక్‌లో కలిసే ఈ వాగు నీరు సముద్రంలోకి చేరుతుంది. సంతదాసుపల్లివాసులు కండలేరువాగును దాటితేనే శ్మశానవాటికకు వెళ్లాల్సి ఉంటుంది. అంతేకాకుండా వాగు అవతల సుమారు 400 ఎకరాల వరకు పంట పొలాలకు రాకపోకలు సాగించాల్సి ఉంటుంది. వాగులో నీరు ప్రవహించే సమయంలో అలువైపు వెళ్లలేని పరిస్థితి. గ్రామంలో ఎవరైనా మృతి చెందితే మృతదేహాన్ని వాగుఅవతల ఉన్న శ్మశాన వాటికకు తీసుకువెళ్లి అంత్యక్రియలు నిర్వహించాలంటే గ్రామస్తులకు ఇబ్బందులు తప్పడంలేదు. వాగు అవతల ఉన్న పొలాల్లో పంటలు సాగు చేసుకునేందుకు ఎరువులు, ఇతర వస్తువులు తీసుకువెళ్లాలన్నా ఇబ్బందులు పడాల్సి వస్తోందని రైతులు చెబుతున్నారు. మూగ జీవాలను మేతకు తీసుకువెళ్లి తిరిగి వచ్చే సమయంలో వాగులో నీటి ఉధృతికి ఓ వ్యక్తి కొట్టుకుపోయి మృతిచెందిన ఘటనలు చోటు చేసుకుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏళ్ల తరబడి ఈ సమస్య పరిష్కారానికి నోచుకోకపోవడంతో రైతులే స్వయంగా గ్రామం నుంచి వాగు అవతలకు దాటేందుకు తాత్కాలికంగా మట్టిరోడ్డును ఏర్పాటు చేసుకున్నారు. అయితే వర్షాల సమయంలో, కండలేరు డ్యాం నుంచి సముద్రంలోకి నీటిని వదిలే సమయంలో వాగులో ప్రవాహం పెరిగి మట్టిరోడ్డు మునిగిపోయి రాకపోకలు ప్రమాదకరంగా మారుతున్నాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కండలేరు వాగుపై లోలెవల్ కాజ్‌వేను నిర్మించి తమ సమస్యను పరిష్కరించాలని ఎమ్మెల్యే సునీల్ కుమార్‌కు రైతులు విన్నవించారు. స్పందించిన ఎమ్మెల్యే కాజ్‌వే నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఇరిగేషన్ అధికారులకు సూచించారు. ఈ మేరకు లోలెవెల్ కాజ్‌వేను నిర్మించేందుకు రూ.1.27 కోట్లు అవసరమవుతాయని ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి అందజేసినట్లు ఇరిగేషన్ అధికారులు తెలిపారు. ప్రభుత్వం స్పందించి త్వరిగతిన లోలెవెల్ కాజ్‌వేను నిర్మించి దారి సౌకర్యం కల్పించాలని సంతదాసుపల్లివాసులు కోరుతున్నారు.




సంగీత విభావరిని తిలకిస్తున్న విద్యార్థులు

ఐఐటీలో ముగిసిన తిరుత్సవ్ 2కే25

- సృజనాత్మకత, సాంకేతిక మేళవింపుతో విద్యార్థుల సందడి
- జోష్ నింపిన మూడ్రోజుల టెక్నో కల్చరల్ ఫెస్ట్

ఏర్పేడు/తిరుపతిరూరల్, ఫిబ్రవరి23(ఆంధ్రజ్యోతి): ఏర్పేడులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ) వేదికగా మూడు రోజులుగా తిరుత్సవ్-2కే25 పేరిట నిర్వహించిన టెక్నో అండ్ కల్చరల్ ఫెస్ట్ ఆదివారంతో ముగిసింది. మూడు రోజులపాటు పలువురు విద్యార్థులు తమ ప్రతిభా నైపుణ్యాలతో అద్భుత ప్రదర్శనలు చేశారు. సృజనాత్మకత, సాంకేతిక సాంస్కృతికల మేళవింపుగా సాగిన తిరుత్సవ్ విద్యార్థుల్లో జోష్ నింపింది. చివరి రోజు ఆదివారం పలు అంశాలపై విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. ట్రెజర్ హంట్ పోటీలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని లక్ష్యాన్ని చేరుకున్న విధానం ఆకట్టుకుంది. విద్యార్థుల్లో భాషణంపై స్పష్టతను పరీక్షించేలా సాగిన పాప్ కల్చర్ క్విజ్ పోటీలు ఆలోచింప చేశాయి. క్రికెట్ ఓ మానియా పాల్గొన్న విద్యార్థుల నుంచి మాక్ ఐపీఎల్ వేలం నిర్వహించారు. అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి దొంగను పట్టుకునే విధానంపై ఎస్కేప్ రూమ్, టెక్ హీస్ట్ పోటీల్లో విద్యార్థులు ప్రతిభ చాటారు. ఇక టెక్నికల్ సదస్సులో అధ్యాపకుల మార్గదర్శకంలో ఆవిష్కరణల రూపకల్పన దిశగా నిర్వహించారు. డైరెక్టర్ ప్రొఫెసర్ కేఎన్ సత్యనారాయణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఉర్రూతలూగించిన సంగీత విభావరి

సినీ నేపథ్య గాయకుడు హరిచరణ్, గాయని శిరీష, ఆకాశ్ బృంద నేతృత్వంలో నిర్వహించిన సంగీత విభావరి ఉర్రూతలూగించింది. సినీ గీతాలకు విద్యార్థులు అడుగులు కదుపుతూ డాన్సులు చేసి సందడి చేశారు. కేరింతలు చప్పట్లతో సంగీత విభావరి హోరెత్తింది.


తరగతి గదిలో విద్యార్థులు

సీఎం చంద్రబాబుకు ఘనస్వాగతం




సీఎం స్వాగతం పలుకుతున్న కలెక్టర్, ఎస్పీ - వినతిపత్రాలు స్వీకరిస్తున్న ముఖ్యమంత్రి

రేణిగుంట, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబుకు ఘన స్వాగతం లభించింది. యాదవ కార్పొరేషన్ ఛైర్మన్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు నరసింహ యాదవ్ తనయుడు వివాహానికి హాజరయ్యేందుకు ప్రత్యేక హెలికాప్టర్లో గన్నవరం నుంచి ఆదివారం మధ్యాహ్నం తిరుపతి విమానాశ్రయం చేరుకున్న ఆయనకు చంద్రగిరి, నగిరి, సత్యవేడు, పలమనేరు, గంగాధర నెల్లూరు ఎమ్మెల్యేలు పులివర్తి నాని, భానుప్రకాష్, కోనేటి ఆదిమూలం, అమరనాథరెడ్డి, థామస్, టీటీడీ బోర్డు సభ్యులు వైద్యం శాంతారాం, డీఐజీ షిమోషి బాజ్‌పాయ్, కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ హర్షవర్ధన్ రాజు, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ మౌర్య, జాయింట్ కలెక్టర్ శుభం బన్సాల్, టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి, ట్రైనింగ్ ఎస్పీ హేమంత్, ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి తదితరులు స్వాగతం పలికారు. అనంతరం ముఖ్యమంత్రి విమానాశ్రయం బయట ప్రజల వద్ద వివిధ సమస్యలపై వినతి పత్రాలు స్వీకరించారు. అక్కడి నుంచి రోడ్డు మార్గాన పెళ్లికి హాజరయ్యారు. మధ్యాహ్నం 12.45 గంటలకు నెల్లూరులో జరిగే వివిధ అభివృద్ధి కార్యక్రమాల్లో హాజరయ్యేందుకు హెలికాప్టర్ బయలుదేరి వెళ్లారు.

మూషిక వాహనంపై ఊరేగిన వినాయకుడు


మూషిక వాహనంపై వినాయకుడు


సారె తీసుకువస్తున్న గిరినాయుడు తదితరులు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): ఏర్పేడు మండలం గుడిమల్లం పరశురామేశ్వరస్వామి ఆలయ మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని రెండో రోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. మూషికవాహనంపై వినాయకస్వామి ఊరేగారు. ఉదయం 7గంటలకు శివయ్యకు అభిషేకాలు, పూజలు నిర్వహించారు. సాయంత్రం స్వామి అమ్మవార్లు చంద్రప్రభ, నెమలి వాహనంపై ఊరేగారు. ఈ కార్యక్రమంలో ఈవో రామచంద్రారెడ్డి, మాజీ ఛైర్మన్ గిరినాయుడు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు నిత్యావసరాల పంపిణీ

గూడూరు అర్బన్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రగతిసేవా సంస్థ కార్యాలయంలో ఆదివారం పొనకా మల్లికార్జున్‌రెడ్డి దాతృత్వంతో పేదలకు నిత్యావసరాలను అందజేశారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్, శ్రీనివాసులు, కరీముల్లా, రాము, కుమార్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

చెత్త సేకరణ నిరంతర ప్రక్రియ

డక్కిలి, ఫిబ్రవరి 23: గ్రామాల్లో చెత్త సేకరణ నిరంతర ప్రక్రియ అని ఈవోపీఆర్డీ అల్లాభక్షు అన్నారు. ఆదివారం మోపూరు వెల్లంపల్లి పంచాయతీలో చెత్త సేకరణపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెత్త నుంచి సంపద సృష్టించి పంచాయతీలు ఆర్థిక పరిపుష్టి సాధించేలా కార్యదర్శులు, సర్పంచులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్సవాల్లో తాగుబోతుల బెడద


ధూర్జటి కళాప్రాంగణంలో భక్తుల మధ్య తాగుబోతు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): పవిత్ర మహాశివరాత్రి ఉత్సవాల్లో తాగుబోతుల బెడద తప్పడంలేదు. భక్తుల రద్దీ మధ్య తాగుబోతులు హల్‌చల్ చేస్తున్నారు. దీంతో మహిళలు, భక్తుల్లో భయాందోళన వ్యక్తమవుతోంది. ధూర్జటి కళాప్రాంగణంలో పెద్దఎత్తున సాంస్కృతిక, ఆధ్యాత్మిక ప్రవచనాలు నిర్వహిస్తుంటారు. ఆదివారం తాగుబోతులు హల్‌చల్ చేశారు. ఓ యువకుడు వేదికముందరే శాస్త్రీయ నృత్య ప్రదర్శనకు ఎదురుగా నిలబడి మద్యం మత్తులో చిందులు వేశారు. ఇదే కళాప్రాంగణంలో భక్తుల మధ్య ఇద్దరు తాగుబోతులు అడ్డంగా పవళించడంతో మహిళలకు అసౌకర్యంగా మారింది. దీనిపై కొందరు భక్తులు అక్కడే విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్‌కు ఫిర్యాదు చేసినప్పటికీ ఆయన కనీసం కుర్చీలో నుంచి కూడా పైకి లేయకుండానే తాగుబోతులను ఇక్కడి నుంచి తరిమితే రోడ్డులో వాహనాల కింద పడి ప్రమాదాలకు గురవుతారంటూ ఉచిత సలహాలు ఇచ్చారు. ఇక ఊరేగింపులో సైతం మందుబాబులు మహిళలపై తూలుతున్నారు.

26నుంచి ట్రాఫిక్ మళ్లింపు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఈనెల 26 నుంచి మార్చి 1వ తేదీ వరకు ట్రాఫిక్ మళ్లిస్తున్నట్లు డీఎస్పీ నరసింహమూర్తి తెలిపారు. ఈ మేరకు ఆదివారం శ్రీకాళహస్తి 1టౌన్ పోలీస్‌స్టేషన్‌లో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 26వ తేదీన మహాశివరాత్రి పురస్కరించుకుని అదే రోజు ఉదయం వేకువజామున 4గంటల నుంచి 1వ తేదీ ఉదయం 8గంటల వరకు శ్రీకాళహస్తిలో కట్టుదిట్టంగా ట్రాఫిక్‌ను అమలు చేస్తామన్నారు. శివరాత్రిరోజున శ్రీకాళహస్తికి నలువైపుల నుంచి వాహనదారులు శివారు ప్రాంతాల్లో నిర్దేశించిన పార్కింగ్ ప్రదేశాల్లో మాత్రమే వాహనాలను నిలపాలనిచెప్పారు. అక్కడి నుంచి ఉచిత బస్సుల ద్వారా ఆలయానికి చేరుకోవాలని తెలిపారు. 26 నుంచి మూడు రోజుల పాటు శ్రీకాళహస్తి పట్టణంలో ద్విచక్ర వాహనాలు తప్ప ఇతర ఏ వాహనాలను అనుమతించేదిలేదని వెల్లడించారు. సీఐలు తిమ్మయ్య, రవినాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఆప్కాస్ రద్దు ఆలోచన విరమించుకోండి



పట్టణంలో ప్రదర్శన నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు

గూడూరు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ఆప్కాస్‌ను రద్దు చేసి ప్రైవేట్ ఏజెన్సీలకు కాంట్రాక్టు ఇచ్చే విధానాన్ని కూటమి ప్రభుత్వం విరమించుకోవాలని సీఐటీయూ నాయకులు అన్నారు. ఆదివారం మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో పట్టణంలో ప్రదర్శన నిర్వహించి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపాలిటీలో పనిచేసే పారిశుధ్య కార్మికుల ఆప్కాస్ విధానాన్ని రద్దుచేసి ప్రైవేట్ ఏజెన్సీలకు కట్టబెట్టే విధంగా ప్రభుత్వం ఆలోచన చేస్తోందన్నారు. ప్రైవేట్ ఏజెన్సీలకు ఇస్తే కార్మికులు వేధింపులకు గురికావాల్సివస్తుందని, వేతనాలను సకాలంలో చెల్లించరని, పీఎఫ్, ఈఎస్ఐ నిధులు గోల్‌మాల్ అయ్యే ప్రమాదం వుంటుందన్నారు. ప్రైవేట్ ఏజెన్సీల ప్రతిపాదనలను విరమించుకుని ఆప్కాస్ ఉద్యోగులందరినీ పర్మినెంట్ చేయాలన్నారు. కార్యక్రమంలో గోపీనాథ్, శివకుమార్, కోటేశ్వరరావు, వెంకటరమణ, రాజేష్, మణి, రాఘవ, సంపూర్ణమ్మ, మణెమ్మ, టీవీ రమణయ్య, సురేష్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీనారాయణ కల్యాణం


అశ్వర్థ వృక్షం, నింభ వృక్షాలకు కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని బాలాంజనేయస్వామి ఆలయంలో మాఘమాసం సందర్భంగా ఆదివారం లక్ష్మీ నారాయణ కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ఉన్న అశ్వర్థ, నింభ వృక్షాలకు వేదపండితులు మంత్రోచ్చరణల నడుమ కల్యాణాన్ని జరిపించారు. ముందుగా వృక్షాలకు సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు చేసి వస్త్రాలతో అలంకరించి ప్రత్యేక పూజలనంతరం అశ్వర్థ, నింభ వృక్షాలకు జిలకర బెల్లం పెట్టి మాంగల్యధారణ చేశారు. ఉభయదాతలుగా సారంగపాణి మస్తాన్ నాయుడు దంపతులు వ్యవహరించారు. ఆలయ ప్రధాన అర్చకులు దీవి లక్ష్మీనారాయణ, ఆలయ మాజీ ఛైర్మన్ ఐతా శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

హైవేపై పార్కింగ్ చేసిన లారీలకు జరిమానా


లారీ డ్రైవర్లతో మాట్లాడుతున్న ఎస్ఐ బ్రహ్మనాయుడు

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట హోలిక్రాస్ సమీపంలో జాతీయ రహదారిపై తరచూ ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో రెండు రోజుల క్రితం పోలీసులు నో పార్కింగ్ బోర్డు ఏర్పాటు చేశారు. అయితే వాహనదారులు నిబంధనలు పాటించకుండా నో పార్కింగ్ బోర్డులున్న చోటే ఆదివారం లారీలు ఆపారు. ఎస్ఐ బ్రహ్మనాయుడు వాహనాల డ్రైవర్లకు కౌన్సిలింగ్ ఇచ్చారు. ఐదు లారీలకు రూ.1000 చొప్పున జరిమానా విధించారు. మరోసారి జాతీయ రహదారిపై వాహనాలు నిలిపితే కఠిన చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు.

లారీ ఢీకొని మోటరు సైక్లిస్టుకు గాయాలు

గూడూరు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోటుపాళెం జాతీయ రహదారిపై ఆదివారి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి గాయాలయ్యాయి. రూరల్ ఎస్ఐ మనోజ్‌కుమార్ వివరాల మేరకు... మండలంలోని పోటుపాళెం గ్రామానికి చెందిన చంద్ర గూడూరుకు వచ్చి తిరిగి గ్రామానికి మోటరు సైకిల్‌పై వెళుతుండగా పోటుపాళెం కూడలి వద్ద ఓ లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో మోటరు సైకిల్‌పై ప్రయాణిస్తున్న చంద్రకు గాయాలయ్యాయి. అతడిని చికిత్స నిమిత్తం ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బాలికతో అసభ్య ప్రవర్తన

పోలీసుల అదుపులో నిందితుడు

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): 10 ఏళ్ల బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిని అలిపిరి పోలీసులు ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. సీఐ రాంకిషోర్ వివరాల మేరకు.. రాజీవ్‌నగర్ ప్రాంతానికి చెందిన బాలిక ఇంటి సమీపంలో పిల్లలతో ఆడుకుంటోంది. అదే ప్రాంతానికి చెందిన రమణాచారి మద్యం మత్తులో ఆ చిన్నారిని బలవంతంగా తన ఇంట్లోకి తీసుకెళ్లి అసభ్యంగా ప్రవర్తించాడు. లైంగిక వేధింపులకు గురిచేశాడు. బాలిక అతని నుంచి తప్పించుకుని పెద్దగా కేకలు వేస్తూ ఇంటికి చేరుకుని తల్లిదండ్రులకు విషయం చెప్పింది. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు విచారణ జరిపిన పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు.

స్థానికులకు మూడు కౌంటర్లలో టిక్కెట్ల విక్రయాలు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని స్థానిక భక్తులకు రూ.200 టిక్కెట్లను మూడు కౌంటర్లలో విక్రయించనున్నట్లు ఈవో బాపిరెడ్డి తెలిపారు. పట్టణంలోని భక్తకన్నప్ప సదన్ (రామచంద్ర థియేటర్ ఎదురుగా), ప్రసన్న వరదరాజస్వామి అతిథి గృహం(నెహ్రూవీధి), సెంట్రల్ రిసెప్షన్ కార్యాలయం (దేవస్థానం ఆర్చి గేటు పక్కన) విక్రయించనున్నట్లు తెలిపారు. భక్తులు 24వ తేదీ ఉదయం 6 నుంచి సాయంత్రం 7గంటల వరకు, 25న ఉదయం 6నుంచి సాయంత్రం 5గంటల వరకు ఆయా కౌంటర్ల వద్ద ఆధార్‌కార్డు ఆధారంగా టిక్కెట్లు ఇవ్వనున్నట్లు తెలిపారు.

ముక్కంటి ఆలయానికి స్మార్ట్‌టీవీల వితరణ




శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయానికి నెల్లూరు జిల్లా పూడిపర్తికి చెందిన సారంగం రామచంద్రయ్య, ప్రమీల రూ.లక్ష విలువైన 55 అంగుళాల స్మార్ట్ టీవీలను వితరణ చేశారు. వీటిని ఆలయ ఈవో బాపిరెడ్డి స్వీకరించి దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. స్వామిఅమ్మవార్ల దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో వేదపండితులు వారిని ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు. డీఎస్పీ నరసింహమూర్తి పాల్గొన్నారు.

ఆరువేల నీళ్లబాటిళ్లు...

శ్రీకాళహస్తీశ్వరాలయానికి చెన్నైకి చెందిన గజలక్ష్మి బాలయ్య 6వేల నీళ్ల బాటిళ్లను వితరణ చేశారు. వాటిని ఆలయ అధికారులు స్వీకరించి దాతకు కృతజ్ఞతలు తెలిపి దర్శన ఏర్పాట్లు చేశారు.

ముక్కంటి సేవలో మధ్యప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూ నాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామిని ఆది వారం మధ్యప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ దుప్పాల వెంకటరమణ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద వేదపండితులు వారిని ఆశీర్వదించిస్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

గ్రావెల్ తరలిస్తే చర్యలు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): తొట్టంబేడు మండలంలో గ్రావెల్‌ను అక్రమంగా తరలిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్‌ఐ ఈశ్వరయ్య తెలిపారు. పొయ్య పంచాయతీలోని రామానాయుడు గిరిజనకాలనీ సమీపంలో కుక్కరాయగుంట నుంచి ఆదివారం గ్రావెల్‌ను అక్రమంగా తరలిస్తుండగా స్థానికుల సమాచారంతో ఎస్‌ఐ ఈశ్వరయ్య అక్కడికి చేరుకుని అడ్డుకున్నారు.

ప్రతి రైతుకు గుర్తింపు సంఖ్య తప్పని సరి

వరదయ్యపాళెం, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతులందరూ రిజిస్ట్రీ పోర్టల్ ద్వారా తమ పేరు నమోదు చేసుకోవాలని వ్యవసాయాధికారి గౌరి తెలిపారు. ఈ మేరకు మండలంలోని సంతవేలూరు పంచాయతీలో రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. రైతులందరూ తమ పేరు, గ్రామం, ఆధార్ నెంబరు, పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌తో లింక్ అయిన ఫోన్ నెంబరు వివరాలను రైతు సేవా కేంద్రంలో ఉన్న సిబ్బందికి ఇచ్చి నమోదు చేసుకోవాలన్నారు. ఈప్రక్రియ పూర్తయ్యాక ఒక విశిష్ట గుర్తింపు సంఖ్య పొందవచ్చని తెలిపారు. రైతులు వెళ్లలేని పరిస్థితిలో ఫోన్ ద్వారా రైతు సేవా కేంద్రంలోని సిబ్బందికి వివరాలను తెలిపి ఓటీపీ ద్వారా నమోదు చేసుకోవచ్చన్నారు. రైతుకు ఈ విశిష్ట గుర్తింపు సంఖ్య లేకపోతే పంట బీమా, పీఎం కిసాన్, పంట నష్టపరిహారం, అన్నదాత సుఖీభవ, వ్యవసాయ యంత్రాలపై రాయితీ, ఇతర ప్రభుత్వ పొందటం సాధ్యం కాదన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. పలువురు రైతులు పాల్గొని సభ్యత్వానికి నమోదు చేయించుకున్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



కళాజాత నిర్వహిస్తున్న క్రై నిర్వాహకులు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని బెంగళూరుకు చెందిన క్రై సంస్థ నిర్వాహకులు అన్నారు. శ్రీకాళహస్తి మండలం ముచ్చివోలు, ఓబులాయపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలు, ఎర్రమరెడ్డిపల్లి, ఎలంపల్లిల్లో మూడు రోజుల పాటు కళాజాత నిర్వహించారు. ఈసందర్భంగా నాగేశ్వరరావు కళా బృందం పాటలు, నాటికల ద్వారా పర్యావరణ పరిరక్షణ, మొక్కలు పెంచడం వల్ల కలిగే ఉపయోగాలను వివరించారు. అదే విధంగా బాల్య వివాహాలు వలన కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సర్పంచులు, ఎస్ఎంసీ కమిటీ సభ్యులు, ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

దర్జీలకు సముచిత స్థానం

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): సమాజంలో ప్రతి మనిషికి ఆమోదయోగ్యంగా దుస్తులు కుట్టే దర్జీలకు సముచితస్థానం కల్పిస్తామని టీడీపీ బీసీ విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎం.ఉమేష్‌రావు అన్నారు. శ్రీకాళహస్తి టైలర్స్ సంక్షేమ సంఘ నూతన కమిటీని టీడీపీ బీసీ విభాగం ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. రోజురోజుకు వృత్తిపరమైన పోటీని తట్టుకునేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న నైపుణ్యాబివృద్ధి పథకాలను ప్రతి టైలర్ సద్వినియోగం చేసుకోవాలన్నారు. వన్నియకుల క్షత్రియ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ మిన్నల రవి, నెమళ్లూరు బుజ్జి, టైలర్స్ సంఘం నాయకులు జి.వి.అమర్‌నాథ్, పి.శ్రీనివాసులెడ్డి, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబుకు ఎమ్మెల్యే ఘనస్వాగతం



పిచ్చాటూరు, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): తిరుపతికి విచ్చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకి ఎమ్మెల్యే ఆదిమూలం ఆదివారం ఘన స్వాగతం పలికారు. తిరుపతిలో ఓ ప్రైవేటు కార్యక్రమానికి హాజరు కావడానికి విచ్చేసిన ముఖ్యమంత్రి రేణిగుంట విమానాశ్రయంలో ఎమ్మెల్యే కలసి స్వాగతం పలికారు.

శాంతమ్మ సేవలు అనిర్వచనీయం

వరదయ్యపాళెం, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): చదువుల గుడిలో ఎందరో విద్యా కుసుమాలను నవ సమాజ నిర్మాతలుగా ఉన్నతస్థాయికి తీర్చి దిద్దిన ప్రధానోపాధ్యాయురాలు దాసరాజు శాంతమ్మ సేవలు అనిర్వచనీయమని సర్పంచ్ చిన్న, ఉపాధ్యాయులు అన్నారు. రామిరెడ్డిపాళెం ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలిగా బాధ్యతలు నిర్వహిస్తూ ఆదివారం శాంతమ్మ పదవీవిరమణ పొందారు. ఆమెను వరదయ్యపాళెం పట్టణంలోని ఓ కల్యాణమండపంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకుడు నరసరాజు, విశ్రాంత ఎంపీడీవో సుబ్రహ్మణ్యంరాజు, పాఠశాల కమిటీ చైర్మన్ ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి

పిచ్చాటూరు, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): మండలంలో పారిశుధ్యంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. గ్రామాల్లోని తడి, పొడి చెత్తను వేరు చేసి ఆయా గ్రామాల్లోని సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ కేంద్రాలకు తరలించే ప్రక్రియ ముమ్మరం చేశారు. ఈవోపీఆర్డీ శ్రీదేవి ఆధ్వర్యంలో ఆయా పంచాయతీ కార్యదర్శులు పర్యవేక్షించారు. పంచాయతీ కార్యదర్శి ప్రకాష్, సిబ్బంది పాల్గొన్నారు.


షార్ట్‌సర్క్యూట్‌తో చెరకు తోట దగ్ధం



పిచ్చాటూరు, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని నీరువాయి సమీపంలో రెండెకరాల్లో చెరకు తోట షార్ట్‌సర్క్యూట్‌తో కాలిపోయింది. విద్యుత్ వైర్లు, బోరు మోటరు పరికరాలు కాలిపోవడంతో రూ.2 లక్షల మేర పంట, ఆస్తి నష్టం జరిగిందని రైతు జి.గోవిందస్వామికి ఆవేదన వ్యక్తం చేశారు.

దేదీప్యం సద్యోముక్తి క్షేత్రం







ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలంకరణ - ఆకట్టుకుంటున్న శివలింగానికి అభిషేకం చేస్తున్నట్టు శ్రీ-కాళ-హస్తి విద్యుత్ దీపాలంకరణ - విద్యుత్ కాంతుల్లో ముక్కంటి ఆలయ పరిసరాలు



లేజర్ లైటింగ్ షో



విద్యుత్ కాంతుల శోభలో శివపార్వతుల విగ్రహాలు

శివరాత్రి ఉత్సవాల్లో శ్రీకాళహస్తి క్షేత్రం విద్యుత్ దీపాలతో దేదీప్యమానంగా ప్రకాశించింది. శ్రీకాళహస్తీశ్వరాలయం విద్యుత్ దీపాలంకరణల దృశ్యాలు కనువిందు చేశాయి. కాగా దక్షిణ గోపురం సమీపంలో విద్యుత్ దీపాలతో శివలింగానికి అభిషేకం చేస్తున్న శ్రీ-కాళ-హస్తి ఈ ఏడాది ప్రత్యేకంగా నిలిచింది. ఏడాదికోసారి కనిపించే ఈ శోభను తిలకించేందుకు భక్తులు, పట్టణవాసులు ఎంతో ఆసక్తి చూపారు.

- శ్రీకాళహస్తి, ఆంధ్రజ్యోతి

నృత్యం అబ్బురం




సాయిదత్త బృందం - హర్షిత సూర్యకుమార్ నృత్య ప్రదర్శన

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా ధూర్జటి కళా ప్రాంగణంలో కళాకారుల నృత్య ప్రదర్శనలు అబ్బురంగా సాగాయి. శ్రీకాళహస్తికి చెందిన సాయిదత్త బృందం నాట్య ప్రదర్శన ఆకట్టుకుంది. చిన్నారులు కార్తీకానంద్, నేత్రానంద్, కుందనసాయి, సాయి సాహితి, హేమశ్రీ, లోమిత రెడ్డి, దీపికరెడ్డి, దాన్వితరెడ్డి, మోక్షిత, వర్షిని, నివాసిని, భూమిక, అన్విత... ఘన ఘన గణపతి, శ్రీకృష్ణ కోలాటం, డోలాయాం, రంగడు కల్యాణం వంటి గీతాలకు నృత్య ప్రదర్శనలు చేశారు. అదే విధంగా పట్టణానికి చెందిన హర్షిత సూర్యకుమార్ ప్రదర్శించిన శివతాండవం అబ్బుర పరిచింది. సాయంత్రం 4గంటలకు పట్టణానికి చెందిన కృష్ణ, సుబ్రహ్మణ్యంరెడ్డి భక్తిరంజనితో ఆదివారం కార్యక్రమాలు మొదలయ్యాయి. గుంటూరుకు చెందిన మహదేవ్ బృందం కూచిపూడి నృత్య ప్రదర్శన, 5గంటలకు పట్టణానికి చెందిన చేష్మిత నృత్య ప్రదర్శన, రాత్రి 11గంటలకు పెద్దపల్లికి చెందిన శివశక్తి నాట్యమండలి ఆధ్వర్యంలో ఈవూరి మాధవరావు మోహిని భస్మాసుర పౌరాణిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.



చిన్నారి నృత్య ప్రదర్శన

అధికార నందిపై భక్తవత్సలుడి దివ్యదర్శనం




అధికార నంది వాహనంపై విహరిస్తున్న భోళాశంకరుడు - యాగశాల పూజలు

నాగలాపురం, ఫిబ్రవరి 23: సురుటుపల్లె పల్లికొండేశ్వరాలయంలో మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం శివయ్య తన అధికార నంది వాహనంపై తిరువీధుల్లో విహరించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆంధ్ర, తమిళనాడు, కర్ణాటక తదితర సదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తుల శివనామ స్మరణలతో ఆలయం మార్మోగింది. ఉదయం ఆలయ ప్రధాన అర్చకుడు కార్తికేశన్ గురుకుల్ పరివార దేవతలకు అభిషేకాలు చేశారు. సాయంత్రం ఆలయ యాగశాల మండపంలో యాగశాల పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం ఆలయంలోని మూలస్థాన మూర్తులు వాల్మీకేశ్వర స్వామి, మరగదాంబిక అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలకు పంచామృతాలతో అభిషేకాది కార్యక్రమాలు చేపట్టారు. తదనంతరం స్వామిఅమ్మవార్లను పట్టువస్త్రాలతో సుందరంగా అలంకరించి నక్షత్ర, కుంభ, మహా హరతులు చేపట్టారు. అనంతరం వాల్మీకేశ్వరుడు పల్లకిలోని తన సతీమణి పార్వతీ దేవితో అధికార నంది వాహనాన్ని అధిరోహించి మంగళ వాయిద్యాల సవ్వడి, కోలాటాల కోలాహలం, బాణసంచా పేలుళ్ల నడుమ తిరువీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. సుమారు 2 గంటల సేపు పాటు జరిగిన తిరువీధి ఉత్సవం కనులపండువగా సాగింది. స్వామిఅమ్మవార్లను దర్శించుకున్న భక్తులు పరవశించిపోయారు. పూజలకు దాసుకుప్పానికి చెందిన ఆలయ మాజీ చైర్మన్ ఏ.వి.ఎం మునిచంద్రశేఖర్‌రెడ్డి(బాలాజీ రెడ్డి) కుటుంబీకులు ఉభయదారులుగా వ్యవహరించారు. ఈ పూజా కార్యక్రమాలను ఆలయ ఈవో లత ఆధ్వర్యంలో సిబ్బంది పర్యవేక్షించారు.

భార్య కాపురానికి రాలేదని భర్త ఆత్మహత్య

రేణిగుంట, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): భార్య కాపురానికి రాలేదని భర్త మనస్థాపం చెంది ఉరివేసుకున్నాడు. అర్బన్ ఎస్‌ఐ అరుణ్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు... తారకరామానగర్‌కు చెందిన ఇబ్రహీం సెంట్రింగ్ పని చేస్తుంటాడు. ఇతనికి వివాహమై ఇద్దరు పిల్లలున్నారు. మద్యానికి, గంజాయికి బానిసై తరచూ భార్య మస్తానీతో గొడవ పడవేవాడు. దీంతో తారకరామానగర్‌లోని తన బంధువుల ఇంట్లో పిల్లలతోపాటు ఉంటోంది. పిల్లల్ని తీసుకుని కాపురానికి రావాలని కోరగా, తాగుడు మానేస్తే వస్తానని పలుమార్లు భార్య చెబుతూ వస్తోంది. ఆదివారం అతిగా మద్యం తాగి మనస్థాపంతో మద్యం మత్తులో తాను ఉంటున్న ఇంట్లోనే ఉరివేసుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రైలు నుంచి జారిపడి యువకుడికి తీవ్రగాయాలు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన శ్రీకాళహస్తి రైల్వేస్టేషన్‌సమీపంలో శనివారం రాత్రి జరిగింది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ నరసింహులు తెలిపిన వివరాలు... యువకుడు రైలు నుంచి జారిపడటంతో కాలు ఛిద్రమైంది. సమాచారం తెలుసుకున్న రైల్వే పోలీసులు ఘటన స్థలానికిచేరుకుని క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం రుయాకు రెఫర్ చేశారు. ఆదివారం రుయాలో ఛిద్రమైన కుడికాలు భాగాన్ని తొలగించినట్లు హెడ్‌కానిస్టేబుల్ నరసింహులు తెలిపారు.

25న జ్యోతీశ్వరస్వామి ఉత్సవాల ధ్వజారోహణం

వరదయ్యపాళెం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జ్యోతీశ్వరాలయంలో ఈనెల 25న మంగళవారం ధ్వజారోహణంతో మహాశివరాత్రి ఉత్సవాలను ప్రారంభిస్తున్నట్టు ట్రస్టీ నందకుమార్ తెలిపారు. 25వ తేది ఉదయం 9గంటలకు ధ్వజారోహణం, 26న మహాశివరాత్రి వేడుకలు, 27న స్వామిఅమ్మవార్ల కల్యాణం నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.

బాల్యవివాహాలపై ఉక్కుపాదం

వరదయ్యపాళెం, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): బాల్యవివాహాలపై ఉక్కుపాదం మోపనున్నట్లు శ్రీసిటీ సీఐ శ్రీనివాసులు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన మాట్లాడుతూ మహాశివరాత్రి సందర్భంగా కొద్దిమంది బాల్య వివాహాలను చేయడానికి ప్రయత్నిస్తారన్నారు. బాల్య వివాహాలు చేసి ఆడబిడ్డల జీవితాలను నాశనం చేయవద్దని కోరారు. ఆడపిల్లలను చదుకు దూరం చేయవద్దన్నారు. వారిని బాగా చదువుకుని ఉన్నత స్థానాలకు చేరుకునే విధంగా తల్లిదండ్రులు చొరవ చూపాలన్నారు. ఎవరైనా బాల్య వివాహాలు చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

శ్రీకాళహస్తీశ్వరాలయంలో శివరాత్రి నిత్య ఉత్సవాల వివరాలు..

- ఉదయం 4.30 గంటలకు : మంగళ వాయిద్యాలు
- ఉదయం 5.00: గోపూజ, సర్వదర్శనం
- ఉదయం 6.00: ప్రథమ కాల అభిషేకం
- ఉదయం 7.00: ద్వితీయ కాల అభిషేకం
- ఉదయం 8.00: పరివార దేవాలయాల నైవేద్యం
- ఉదయం 9.00: స్వామిఅమ్మవార్ల పురవీధుల ఉత్సవం
- ఉదయం 10.30: ఉచ్చికాల అభిషేకం
- సాయంత్రం 5.00 గంటలకు: ప్రదోష కాలాభిషేకం
- రాత్రి 8.00: స్వామి అమ్మవార్ల పురవీధుల ఉత్సవం
- రాత్రి 9.30 గంటలకు: దర్శనం ముగింపు

నేడు రావణాసుర - మయూర వాహన సేవలు




శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని సోమవారం రావణబ్రహ్మ వాహనంపై పరమేశ్వరుడు, మయూర వాహనంపై జ్ఞానప్రసూనాంబ అమ్మవారు పురవీధుల్లో ఊరేగనున్నారు. లంకాధీశుడైన రావణబ్రహ్మపై ఆధిపత్యాన్ని చెలాయిస్తూ స్వామివారు... మయూర వాహనంపై అమ్మవారు భక్తులను కావనున్నారు. కాగా ఉదయం పరమేశ్వరుడు హంసవాహనంపైన, పార్వతిదేవి యాళి వాహనంపైన పురవీధుల్లో విహరిస్తారు.

నేడు గాంధర్వ రాత్రి

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడో తిరునాళ్లను గాంధర్వ రాత్రిగా పిలుస్తారు. గాంధర్వ రాత్రి అంటే రావణాసురుడు ప్రధాన భూమిక పోషించగా... నారద తుంబర్లతో పాటు గాంధర్వులు సమావేశమై సకల దేవ, భూత గణాల సమక్షంలో పరమేశ్వరుణి కీర్తిస్తారు. ఈ నేపథ్యంలోనే స్వామివారు రావణాసురునిపై, అమ్మవారు మయూర వాహనంపై ఊరేగుతారు.

అన్నదాన కేంద్రం పరిశీలన



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): శ్రీకాళ హస్తీశ్వరాలయ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన కేంద్రాన్ని ఆదివారం శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి తల్లి బృందమ్మ పరిశీలించారు. ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భక్తులకు సంతృప్తికరమైన భోజనం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.